www.aashwi.net / in PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

## JOURNALISTS WANTED

- Aashwi Updates – Voice of the People
- Telangana & Andhra Pradesh
- District Bureau: Degree mandatory
- Mandal Reporters: Intermediate mandatory
- News writing & reporting skills required
- Interest in public issues preferred
- Honorarium: Based on experience & performance
- Join Aashwi Updates. Be the Voice of the People!

editor@aashwi.in

7207282727 | 72707292727



## వైఎస్సార్ ఆశయ ప్రాజెక్టులను పూర్తి చేసి తెలంగాణకు అంకితం చేస్తాం

5

గురువారం, 03-09-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :120 Issue : 120 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

## షోకాజ్ నోటీసులు ఇవ్వడమే తప్పు



- నా కూతురు వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయొద్దు
- నాపై మాట్లాడిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపైనా చర్యలు తీసుకోవాలి
- బీసీలకు అన్యాయం చేస్తే ఏకమవుతారు
- అధిష్టానానికి చెప్పాల్సింది చెప్పా
- మంత్రి కొండా సురేఖ

2

## గ్లోబల్ సమ్మిట్ రక్ష ఎక్స్‌పోలో భాగస్వాములు కండి

- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానం
- దేవరకద్ర డీఆర్‌డీఎల్కు ఉచితంగా భూ కేటాయింపు
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు 1500 ఎకరాల సేకరణకు రాష్ట్రం ఆమోదం

3





## విమానాశ్రయాల పనులు వేగవంతం చేయండి

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

3

## జన ఆకాంక్షల కేంద్రంగా వెయ్యి రోజుల పాలన

- పేదల అవసరాలు, ఆత్మగౌరవాల మేళవింపుతో సంక్షేమం
- వెయ్యి రోజుల పాలనపై 'ఎక్స్'లో సీఎం రేవంత్ పోస్టు

3



## ప్రజా హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు

3



## అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం

- భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమీషన్లు
- వెయ్యి రోజుల్లో రూ.4.50 లక్షల కోట్ల అప్పులు
- రుణ మాఫీ, పెన్షన్లు, ఉద్యోగాలు మోసపూరిత హామీలే
- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ చార్జిషీట్
- సీఎం రేవంత్ పాలనపై నిప్పులు చెరిగిన కేటీఆర్

2

## కాగితాలమీదే ఆర్టీసీ లాభాలు



- ఆర్టీసీకి రూ. 2,600 కోట్ల బకాయిలు చెల్లించాలి
- హరీష్ రావు డిమాండ్

2

## కుట్టు మిషన్ల కొనుగోలు ప్రక్రియ 7లోపు పూర్తి చేయాలి

- 15 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 'కళ్యాణ లక్ష్మి' దరఖాస్తులు వేగవంతంగా పరిష్కరించాలి
- బీసీ సంక్షేమ శాఖ సమీక్షలో మంత్రి పొన్నం ఆదేశాలు

3

# రాజీనామా డిమాండ్‌తో సీఎం దూకుడు

- అధికార పార్టీకి చెక్ పెట్టేలా బీఆర్ఎస్ ప్రతివ్యూహం
- అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీసేలా వ్యూహం
- కేటీఆర్, హరీశ్ రావులతో ఎదురుదాడి
- ప్రభుత్వ వైఫల్యాలు కేసీఆర్ రాజీనామాతో చెల్లుబాటు అవుతాయా?
- ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే ఎత్తుగడేనంటున్న ప్రతిపక్షం
- తెలంగాణ ఆత్మగౌరవ కార్డుతో కౌంటర్
- గులాబీ బాస్ వ్యూహాత్మక మౌనం
- సరైన సమయంలో కేసీఆర్ గ్రాండ్ రీ-ఎంట్రీ

- రేవంత్ డైవర్షన్ గేమ్ అంటున్న బీఆర్ఎస్
- ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి గులాబీదళం




హైదరాబాద్, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్: ప్రతిపక్ష నేత కేసీఆర్ రాజీనామా చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేయడం తెలంగాణ రాజకీయాల్లో కొత్త వేడి రేపుతోంది. పని చేయని ప్రతిపక్ష నేతగా కేసీఆర్‌ను చిత్రీకరిస్తూ ఊరూవాడ నిరసనలు చేపట్టాలని సీఎం పిలుపునివ్వడంతో కాంగ్రెస్ రాజకీయ దాడిని మరింత తీవ్రం చేసింది. అయితే ఈ 'రాజీనామా' అస్త్రం వెనుక అసలు లక్ష్యం ఏమిటన్నదే ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. ప్రభుత్వం ఎదుర్కొంటున్న వైఫల్యాలు, హామీల అమలు, రైతు సమస్యలు, హైడ్రా కూల్చివేతలు, మూసీ పునరుజ్జీవనం వంటి అంశాలపై ప్రజల్లో జరుగుతున్న చర్చను పక్కదారి పట్టించేందుకే రేవంత్ ఈ ఎత్తుగడకు దిగారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది.

డైవర్షన్ గేమ్ అంటున్న ప్రతిపక్షం

కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలనలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు, రైతుబంధు, రుణమాఫీ, నిరుద్యోగుల సమస్యలు, రైతుల ఇబ్బందులు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం బీఆర్ఎస్‌కు ఉంది. ఇదే సమయంలో కేసీఆర్ రాజీనామా అంశాన్ని తెరపైకి తీసుకురావడం ద్వారా రాజకీయ చర్చను పూర్తిగా మరో దిశకు మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ప్రతిపక్షం వాదిస్తోంది. 'ప్రభుత్వ వైఫల్యాలకు కేసీఆర్ రాజీనామాతో పరిష్కారం ఏమిటి?' అన్న ప్రశ్నను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ భావిస్తోంది.

**రాజీనామా అస్త్రంతో దూకుడు**

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారంటూ

మిగతా 2వ పేజీలో..

## జాతీయ జలభద్రతకు ఏకీకృత కార్యాచరణ

- జలభద్రత ఒక ప్రభుత్వ శాఖకే పరిమితం కాకూడదు
- ప్రతి ఆస్తికి 'యూనిక్ ఐడీ' కేటాయించాలి
- జల్ సంచయ్–జన్ భాగీదారీ' సదస్సులో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

## కాంగ్రెస్ 420 హామీలతో ప్రజా ద్రోహం

- మాట నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు

3





## రికార్డు ధరకు హౌసింగ్ బోర్డు ప్లాట్లు

2

## తుక్కుగూడ నర్సు హత్యపై మహిళా కమిషన్ సుమోటో విచారణ

- డీజీపీకి ఎన్‌సీడబ్ల్యూ లేఖ
- వేగంగా దర్యాప్తు.. నిందితుడిపై కఠిన చర్యలు
- ఫోరెన్సిక్, డిజిటల్ ఆధారాల సేకరణ
- ఏడు రోజుల్లో యాక్షన్ టేకన్ రిపోర్ట్

2







## పేదల ఆత్మగౌరవం ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

- రెవెన్యూ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్ : తమది పేదవాడి కష్టం తెలిసిన ప్రభుత్వమని, గత ప్రభుత్వం వదిలి వెళ్లిన భారీ అప్పులు, పెండింగ్ బిల్లులను చెల్లిస్తూనే ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి

మిగతా 2వ పేజీలో..

## తుక్కుగూడ నర్సు హత్యపై మహిళా కమిషన్ సుమోటో విచారణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్:** తుక్కుగూడలో నర్సుపై అత్యాచారం, హత్య ఘటనపై జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) సుమోటోగా విచారణ చేపట్టింది. ఘటనను తీవ్రంగా పరిగణించిన కమిషన్ తెలంగాణ డీజీపీకి లేఖ రాసింది. కేసు దర్యాప్తును వేగవంతం చేసి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలతో పాటు ఏడు రోజుల్లో యాక్షన్ టేకన్ రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించింది.

**నిందితుడి నేరచరిత్రపై ఆరా**

నిందితుడిని కస్టడీలోకి తీసుకుని విచారించాలని, ఘటనకు దారితీసిన పరిస్థితులు, హత్యకు గల కారణాలను వెలుగులోకి తీసుకురావాలని ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ సూచించారు. నిందితుడి పూర్వ నేరచరిత్రను పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.

**ఆధారాల సేకరణకు ప్రాధాన్యం**

అత్యాచారం, హత్య, క్రిమినల్ ట్రెస్‌పాస్‌కు సంబంధించిన బీఎన్ఎస్ సెక్షన్లను కఠినంగా అమలు చేయాలని కమిషన్ స్పష్టం చేసింది. వైద్య పరీక్షలు, పోస్టుమార్టం, ఫోరెన్సిక్, డిజిటల్ ఆధారాలను భద్రపరిచి సమగ్రంగా పరిశీలించాలని సూచించింది. సీడీఆర్‌లతో పాటు ఇతర సాంకేతిక ఆధారాలను సేకరించాలని ఆదేశించింది.

**కుటుంబానికి రక్షణ, న్యాయసాయం**

బాధితురాలి కుటుంబానికి భద్రత కల్పించడంతో పాటు అవసరమైన న్యాయసాయం అందించాలని ఎన్‌సీడబ్ల్యూ సూచించింది. కుటుంబానికి వర్తించే చట్టబద్ధ పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

**ఏడు రోజుల్లో నివేదిక**

దర్యాప్తు పురోగతి, ఫోరెన్సిక్ నివేదికలు, ఛార్జ్‌షీట్ దాఖలు గడువు, కేసు పర్యవేక్షణకు తీసుకున్న చర్యల వివరాలతో ఏడు రోజుల్లో యాక్షన్ టేకన్ రిపోర్ట్ సమర్పించాలని తెలంగాణ పోలీసులను కోరింది. పనిచేసే మహిళల భద్రత, గౌరవం విషయంలో రాజీపడేది లేదని జాతీయ మహిళా కమిషన్ స్పష్టం చేసింది.

## పేదల ఆత్మగౌరవం ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి సచివాలయంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుమారు 3,475 రోజులు పాలించిన గత ప్రభుత్వం రాష్ట్రంపై ఆర్థిక భారాన్ని మోపి వెళ్లినప్పటికీ సంక్షేమం, అభివృద్ధిని ఎక్కడా ఆపకుండా తమ వెయ్యి రోజుల ప్రజా పాలనను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. గతంలో ఆగిపోయిన అభివృద్ధి పనులకు సంబంధించిన అసలైన బిల్లులు, సర్పంచులు, కాంట్రాక్టర్ల బకాయిలను కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. త్వరలోనే రాష్ట్రంలో మరో మూడు లక్షలకు పైగా కొత్త పింఛన్లను మంజూరు చేయనున్నట్లు ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు.

**4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు**

మొదటి విడతలో మంజూరు చేసిన 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే రెండు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం రూ. 5 లక్షల సహాయం అందిస్తోంది. త్వరలోనే రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నారు.

**హైదరాబాద్‌లో 'ఇందిరమ్మ టవర్స్'**

పేదలను దూరప్రాంతాలకు పంపకుండా వారు నివసించే నియోజకవర్గాల్లోనే, ఎకరం రూ. 100 కోట్లకు పైగా విలువైన ఖరీదైన స్థలాల్లో ఇళ్లు నిర్మిస్తున్నారు. పైలట్ ప్రాజెక్టుగా హైదరాబాద్‌లోని 20 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నారు. ప్రతి నియోజకవర్గానికి సుమారు 600 ఇళ్ల చొప్పున బహుళ అంతస్తుల్లో లిఫ్ట్, మౌలిక వసతులతో నిర్మిస్తున్నారు. పారదర్శక లక్కీ డ్రా విధానం ద్వారా ఎంపిక చేసిన అర్హులైన మహిళల పేరు మీదనే 525 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఇంటిని, భూమిలో అన్‌డివైడెడ్ షేర్‌తో రిజిస్టర్ చేస్తారు. దీనికోసం పేదలపై రూపాయి భారం పడదని, ఎలాంటి పైరవీలు, సిఫారసులకు అవకాశం లేదని తేల్చి చెప్పారు.

**రైతు భరోసా & నిరుద్యోగులకు ఊరట**

గత వెయ్యి రోజుల్లో రైతు సంక్షేమానికి రూ. 1.76 లక్షల కోట్లు వెచ్చించామని, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి వేలాది ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేశామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను అందుబాటులోకి తెస్తున్నట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు.

## అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల దగా పాలనపై పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావుతో కలిసి తెలంగాణ భవన్‌లో బుధవారం చార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతమే.. వెయ్యి రోజుల పాలన కాదు.. పీడన. జలద్రోహం చేస్తున్న జలగల పాలన అని మండిపడ్డారు. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో అని అన్నారు. పేదల భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కవి□షన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు చేయకున్నా ఈ ప్రభుత్వం రూ .4.50లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. కాంగ్రెస్ అసమర్థత ప్రో మ్యాక్స్, అవినీతి అల్ట్రామ్యాక్స్, అరాచకం ఐమ్యాక్స్ అంటూ విమర్శలు గుప్పించారు. రూ.50వేల కోట్లు రుణ మాఫీ చేస్తామని రూ.20వేల కోట్లు చేశారని, రుణ మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టుపెట్టారని, మాఫీ చేయకుండా 70శాతం మందికి కుచ్చుటోపీ పెట్టారని విమర్శించారు. తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా కేసీఆర్ మారిస్తే కాంగ్రెస్ నాశనం చేసిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో దరిద్రం దండయాత్ర మొదలుపెట్టి వెయ్యి రోజులు అయింది.. రాష్ట్ర సంపదను కొల్లగొట్టే విషయంలో సీఎం, మంత్రులు కొట్టుకుంటున్నారు.. కాంగ్రెస్ పాలనలో దిల్లీకి మూటలు, పదవుల కోసం కీచులాటలు తప్ప ఏం లేదు.. రైతుబంధు బంద్ అయ్యింది.. రాహుల్ బంధు మొదలైంది అని విమర్శించారు. గోదావరి, కృష్ణా జలాల వాటాల్లో రాష్ట్రానికి అన్యాయం జరిగితే మిమ్మల్ని వదిలిపెట్టం అని హెచ్చరించారు. మిస్ వరల్డ్ పోటీలు, మెస్సీ కోసం నిధులు భారీగా ఖర్చు చేస్తారు కానీ రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు పెట్టరని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, జాబ్ క్యాలెండర్ పేరిట జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని అన్నారు. దిల్లీలో జెన్ జీని వెంటపెట్టుకుని ప్రజాస్వామ్యమని రాహుల్ కొటేషన్లు చెబుతుంటే ఇక్కడ మాత్రం నిరుద్యోగులపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర సంపద కోసం మంత్రులు, ముఖ్యమంత్రి తన్నుకున్నారని, ప్రజా పాలన కాదు వెయ్యి రోజుల శని పాలన అని అన్నారు. వెయ్యి రోజులుగా ప్రజలకు నరకం చూపిస్తున్నారంటూ ఆర్థిక, సామాజిక విధ్వంసం తప్ప చేసిందేవి□ లేదన్నారు. చంద్రబాబుకు గురు దక్షిణగా కృష్ణా, గోదావరి నీళ్లు ఇస్తున్నాడన్నారు. అందాల పోటీలకు పెట్టిన ఖర్చులో పదో వంతు ఖర్చు చేస్తే కాఫర్ డ్యాం కట్టి నీళ్లు ఇయ్యొచ్చని ఇంజిర్లు చెబితే వారికి బెల్టు ట్రీట్‌మెంట్ ఉంటుందని భయపెట్టారని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ కుప్పకూల్చినా, చెక్ డ్యాంలు కూలినా బీజేపీ, ఎన్‌డీఎస్‌ఏ నోరు తెరవకపోవడాన్ని ఆక్షేపించారు. జీఆరఎంబీలో తెలంగాణ ప్రాజెక్టులు రద్దు చేయాలని ఎజెండా పెడితే పారిపోతున్నారన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూములను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. యూరియా అడిగిన రైతులపై లాఠీచార్జి చేశారు.. కాళేశ్వరంపై కక్ష రైతన్నకు శిక్ష.. మోటర్లకు మీటర్లు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రియల్ ఎస్టేట్ కుప్ప కూలిందన్నారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తోపాటు పలువురు సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు.

# రాజీనామా డిమాండ్‌తో సీఎం దూకుడు

**మొదటిపేజీ తరువాయి**

కొంతకాలంగా కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు రేవంత్ ఇప్పుడు 'రాజీనామా' డిమాండ్‌ను జోడించారు. కేసీఆర్ ప్రజా జీవితానికి దూరంగా ఉన్నారన్న భావనను బలపరిచేందుకు కాంగ్రెస్ ఈ అంశాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని చూస్తోంది. ఊరూవాడ నిరసనలకు పిలుపునివ్వడం ద్వారా పార్టీ శ్రేణులను కదిలించడంతో పాటు బీఆర్ఎస్‌పై రాజకీయ ఒత్తిడి పెంచాలన్నది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది.

**తెలంగాణ ఆత్మగౌరవ కార్డుతో కౌంటర్**

రేవంత్ దాడికి బీఆర్ఎస్ భిన్నమైన కోణంలో సమాధానం ఇవ్వాలని చూస్తోంది. కేసీఆర్‌ను కేవలం ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా తెలంగాణ రాష్ట్ర సాధనతో ముడిపడిన నాయకుడిగా ప్రజల్లో ఉన్న గుర్తింపును మరోసారి ముందుకు తెచ్చే ప్రయత్నం జరగవచ్చు. 'తెలంగాణ కోసం పోరాడిన నాయకుడిని అవమానిస్తున్నారు' అనే సెంటిమెంట్‌ను బలపరచడం ద్వారా రాజీనామా డిమాండ్‌ను వ్యక్తిగత రాజకీయ దాడిగా మార్చే వ్యూహాన్ని బీఆర్ఎస్ అనుసరించే అవకాశం ఉంది.

**గులాబీ బాస్ వ్యూహాత్మక మౌనం**

రేవంత్ విసిరిన సవాల్‌కు కేసీఆర్ వెంటనే స్పందించకపోవడమే ఆయన వ్యూహంలో భాగమని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యమంత్రి





సవాలు చేసిన వెంటనే రోడ్డుపైకి వస్తే రేవంత్ వేసిన రాజకీయ ఎజెండాలోనే కేసీఆర్ చిక్కుకున్నట్లవుతుందని పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. అందుకే ప్రస్తుతం కేటీఆర్, హరీశ్ రావు వంటి సీనియర్ నేతలతో ప్రభుత్వంపై ఎదురుదాడి కొనసాగిస్తూ.. కేసీఆర్ మాత్రం వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారని తెలుస్తోంది.

**సరైన సమయంలో గ్రాండ్ రీ-ఎంట్రీ**

కేసీఆర్ మళ్లీ ప్రజాక్షేత్రంలోకి రావడంపై బీఆర్ఎస్‌లో అంతర్గతంగా కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే రేవంత్ సవాల్‌కు ప్రతిస్పందనగా కాకుండా.. రాజకీయంగా అనుకూలమైన సమయంలో భారీ బహిరంగ సభతో రీఎంట్రీ ఇవ్వాలన్నది వ్యూహంగా కనిపిస్తోంది. ప్రజా సమస్యలను కేంద్రంగా చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేపట్టడం ద్వారా తన రాజకీయ పునరాగమనానికి బలమైన కారణాన్ని చూపించాలన్న ఆలోచన ఉన్నట్లు సమాచారం.

**అసెంబ్లీ వేదికగా చెక్**

సెప్టెంబరులో జరగనున్న శాసన సభ సమావేశాలు బీఆర్ఎస్‌కు కీలక వేదికగా మారే అవకాశం ఉంది. సభకు కేసీఆర్ హాజరైతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నేరుగా నిలదీసే అవకాశం లభిస్తుంది. ఆరు గ్యారెంటీల అమలు, రుణమాఫీ, రైతుల సమస్యలు, నిరుద్యోగం తదితర అంశాలపై గణాంకాలతో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ద్వారా 'పనిచేయని నాయకుడు' అన్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్ఎస్ భావిస్తోంది. రేవంత్ విసిరిన 1,000 రోజుల పాలన సవాల్‌కు సభలోనే సమాధానం ఇవ్వాలని పార్టీ వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

**కేటీఆర్, హరీశ్‌తో ఎదురుదాడి**

కేసీఆర్‌పై రేవంత్ చేస్తున్న వ్యక్తిగత విమర్శలకు ఆయన నేరుగా స్పందించకుండా కేటీఆర్, హరీశ్ రావులను ముందుకు పంపడం బీఆర్ఎస్ వ్యూహంలో మరో కీలక అంశంగా కనిపిస్తోంది. ప్రభుత్వ విధానాలు, హామీల అమలు, ప్రజా సమస్యలపై ఇద్దరు నేతలు ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తున్నారు. అదే సమయంలో క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్‌ను క్రియాశీలం చేసి కాంగ్రెస్ చేపడుతున్న 'కేసీఆర్ రాజీనామా' ఆందోళనలకు రాజకీయంగా కౌంటర్ ఇవ్వాలని చూస్తోంది.

**రేవంత్ అఫెన్సివ్.. కేసీఆర్ సైలెన్స్**

రేవంత్ రెడ్డి దూకుడైన రాజకీయ అఫెన్సివ్‌తో కేసీఆర్‌పై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తుంటే.. కేసీఆర్ మాత్రం తనకు అలవాటైన వ్యూహాత్మక మౌనాన్నే ఆయుధంగా మార్చుకుంటున్నారన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రాజీనామా డిమాండ్ చుట్టూ రాజకీయ చర్చను కొనసాగనిచ్చి, సరైన సమయంలో ప్రజా సమస్యలను కేంద్రంగా చేసుకుని రీ-ఎంట్రీ ఇవ్వడం ద్వారా మొత్తం నారేటివ్‌ను మార్చాలన్నది బీఆర్ఎస్ వ్యూహంగా కనిపిస్తోంది. రేవంత్ వేసిన 'పనిచేయని నాయకుడు' ముద్రను తిప్పికొట్టి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల దృష్టిని మళ్లీ నిలిపేలా చేయడమే కేసీఆర్ ముందున్న అసలు సవాలుగా మారింది.

## జాతీయ జలభద్రతకు ఏకీకృత కార్యాచరణ

**న్యూదిల్లీ, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్ :** దేశవ్యాప్తంగా చేపడుతున్న ప్రతి జల సంరక్షణ పనిని ఒకే జలభద్రతా ప్రణాళిక పరిధిలోకి తీసుకురావాలని నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి జల సంరక్షణ ఆస్తికి ప్రత్యేక గుర్తింపు ఉండాలని, దాని నిర్వహణకు నిర్దిష్ట బాధ్యతగల సంస్థను కేటాయించడంతోపాటు కొలవగలిగే స్పష్టమైన ఫలితాలను సాధించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూదిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్‌లో బుధవారం నిర్వహించిన తొలి 'జల్ సంచయ్-జన్ భాగీదారీ' జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. జలభద్రత అనేది కేవలం ఒక ప్రభుత్వ శాఖ లేదా ఇంజినీరింగ్ విభాగానికే పరిమితం కాకూడదని, తాగునీరు, వ్యవసాయ స్థిరత్వం, పర్యావరణ పరిరక్షణ కోసం ఇది ప్రజలందరి భాగస్వామ్యంతో కూడిన ప్రజా ఉద్యమంగా మారాలని పిలుపునిచ్చారు.

**సమన్వయ లోపం అధిగమించాలి**

ఉపాధి హామీ, పీఎంకేఎస్‌వై, 'కంపా', ఆర్థిక సంఘం, సీఎస్ఆర్ నిధులతో వేర్వేరుగా పనులు చేపట్టడం వల్ల ప్రణాళికల్లో విచ్ఛిన్నం, నిధుల పునరావృతం జరుగుతున్నాయని విమర్శించారు. వీటి స్థానంలో ప్రతి ఆస్తికి 'యూనిక్ ఐడీ' కేటాయించి జియో ట్యాగింగ్ చేయాలని ఆయన ప్రతిపాదించారు.

**తెలంగాణ రికార్డు**

'జల్ సంచయ్-జన్ భాగీదారీ' కింద 2025లో తెలంగాణ అత్యుత్తమ పనితీరు కనబరచడమే కాకుండా దేశంలోని టాప్ 50 జల సంరక్షణ జిల్లాల్లో రాష్ట్రానికి చెందిన 13 జిల్లాలు స్థానం సాధించాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు. రాష్ట్రంలో 44,360 చెరువులకు గాను ఇప్పటికే 22,428 జలవనరుల పునరుద్ధరణ పూర్తయినట్లు వెల్లడించారు.

**రూ. 46,110 కోట్ల ప్రణాళికలు**

2026-29 మూడేళ్ల వ్యవధిలో రూ. 46,110.35 కోట్ల అంచనా వ్యయంతో కొత్తగా 17.28 లక్షల ఎకరాలకు సాగునీటి సదుపాయం కల్పించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. రాష్ట్రంలోని



18 ప్రధాన జలాశయాల్లో పూడిక వల్ల దాదాపు 22.95 శాతం (40.97 టీఎంసీలు) నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందని, దీనిని పునరుద్ధరించేందుకు దిగువ మానేరు, మధ్య మానేరు, కడెం ప్రాజెక్టుల్లో ఆదాయ ఆధారిత పూడికతీత పనులను ప్రయోగాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు.

**తెలంగాణ ప్రాజెక్టులకు పీఎంకేఎస్‌వై కింద ప్రాధాన్యం**

తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు పిఎంకెఎస్‌వై కింద ప్రాధాన్యం ఇవ్వాలని, పర్యావరణ అనుమతులను నిర్దిష్ట గడువులోగా మంజూరు చేయాలని మంత్రి కోరారు.



## రికార్డు ధరకు హౌసింగ్ బోర్డు ప్లాట్లు

- కేపీహెచ్‌బిలో గజం భూమి రూ.2.70 లక్షలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్ :** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బి) కాలనీలోని ఓపెన్ ప్లాట్లకు బహిరంగ వేలంలో మరోసారి భారీ ధర పలికిందని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి. గౌతమ్ తెలిపారు. బుధవారం నిర్వహించిన వేలం పాటలో కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లోని 16 ఎంఐజీ ప్లాట్లకు సంబంధించి గరిష్టంగా చదరపు గజం భూమి రూ. 2.70 లక్షల రికార్డు ధరకు అమ్ముడు పోయినట్లు వెల్లడించారు. ఈ ప్లాట్ల విక్రయానికి ఆగస్టు 10న నోటిఫికేషన్ విడుదల చేయగా చదరపు గజానికి కనీస ధర రూ.1.60 లక్షలుగా నిర్ణయించారు. వేలంలో తీవ్ర పోటీ నెలకొనడంతో ఒక ప్లాట్ రూ.2.70 లక్షలు, మరొకటి రూ.2.36 లక్షలు, అలాగే మరో రెండు ప్లాట్లు రూ.2.06 లక్షల చొప్పున అమ్ముడయ్యాయి. మొత్తం 19 మంది బిడ్డర్లు పాల్గొన్న ఈ వేలం పాటలో సగటున చదరపు గజం ధర రూ.1.79 లక్షలు పలికింది. ఈ బహిరంగ వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు సుమారు రూ.47.14 కోట్ల ఆదాయం సమకూరిందని వైస్ ఛైర్మన్ వివరించారు.

## కాగితాలమీదే ఆర్టీసీ లాభాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్ :** ప్రభుత్వ వేదికలపై ఆర్టీసీ వేల కోట్ల లాభాల్లో ఉందని సీఎం రేవంత్ రెడ్డి గొప్పలు చెబుతున్నారని, కానీ ఆర్టీసీ ఎండీ మాత్రం ప్రభుత్వం నుంచి రూ.2,600 కోట్ల బకాయిలు రావాలని లేఖ రాశారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. కాగితాల మీద ఆర్టీసీ లాభాల్లో ఉందని చెబుతూ క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, విశ్రాంత కార్మికుల జీవితాలను అప్పుల ఊబిలోకి నెట్టారని బుధవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ ప్రభుత్వం 'ప్రజా ప్రభుత్వం' కాదని, కేవలం 'ప్రచార ప్రభుత్వం' అని ధ్వజమెత్తారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్లే ఉద్యోగులకు పీఆర్సీ, ఏరియర్స్ అందడం లేదని తెలిపారు. 30-40 ఏళ్ల పాటు సేవ చేసిన సుమారు 18 వేల మంది విశ్రాంత ఉద్యోగులకు నేటికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందకపోవడం దారుణమన్నారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇప్పటికే 400 మంది రిటైర్డ్ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోవడం కలచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ సౌకర్యం లేని వీరికి గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పీఆర్సీ ఏరియర్సే చివరి ఆసరాని, వాటిని కూడా ఆపేయడం ప్రభుత్వ అమానవీయ వైఖరికి పరాకాష్ట అని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రూ.2,600 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేసి విశ్రాంత కార్మికుల హక్కులను నెరవేర్చాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

## షోకాజ్ నోటీసులు ఇవ్వడమే తప్పు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్:** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితా పటేల్ వ్యాఖ్యలతో నెలకొన్న వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీకి వెళ్లిన కొండా సురేఖ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిశారు. తన కుమార్తె వ్యాఖ్యలకు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సుస్మితకు పెళ్లయిందని, ఆమె స్వతంత్రంగా జీవిస్తున్నారని తెలిపారు. ఆమెను మాట్లాడొద్దని చెప్పే హక్కు తనకు లేదన్నారు.

**షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పు**

తన కుమార్తె వ్యాఖ్యలను తాను సమర్థించడమూ, ఖండించడమూ చేయనని సురేఖ తెలిపారు. ఆమె మాట్లాడిన విషయాలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదన్నారు. అసలు తనకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పని పేర్కొన్నారు. తనకు ఇచ్చిన షోకాజ్ నోటీసుపైనే స్పందించానని, తుది నిర్ణయం అధిష్టానానిదేనని చెప్పారు.

**తనపై మాట్లాడిన వారిపైనా చర్యలు**

తనపై విమర్శలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపైనా చర్యలు తీసుకోవాలని సురేఖ డిమాండ్ చేశారు. తనపై మాట్లాడిన వారు బలవంతంగా వచ్చి వ్యాఖ్యలు చేశారని అన్నారు. వారి వెనుక ఎవరున్నారో తనకు తెలుసని, పేర్లు చెబితే వివాదం మరింత ముదురుతుందని పేర్కొన్నారు. వారికీ షోకాజ్ నోటీసులు ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని కోరారు.

**బీసీలకు అన్యాయం చేస్తే ఏకమవుతారు**

తన భర్త మున్నూరు కాపు, తాను పద్మశాలి అని సురేఖ తెలిపారు. తెలంగాణలో బీసీలకు గణనీయమైన ఓటు బలం ఉందన్నారు. బీసీ మహిళనైన తనకు ఒక న్యాయం, ఇతర సామాజిక వర్గాలకు చెందిన నేతలకు మరో న్యాయం చేస్తారా అని ప్రశ్నించారు. తనపై ఏకపక్షంగా చర్యలు తీసుకుంటే బీసీలు ఏకమవుతారని హెచ్చరించారు.

**పదవిలో కొనసాగించాలని విజ్ఞప్తి**

తాను తన శాఖను సమర్థంగా నిర్వహిస్తున్నాని, ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఉన్నానని సురేఖ తెలిపారు. తన పదవికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరినట్లు చెప్పారు. ఖర్గే, మీనాక్షి నటరాజన్ పార్టీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని వెల్లడించారు. కేసీ వేణుగోపాల్‌ను కలవాలని ప్రయత్నించినా ఆయన బిజీగా ఉండటంతో అపాయింట్‌మెంట్ దొరకలేదన్నారు.



**రేవంత్‌పై ముందుగా చర్యలు తీసుకోవాలి**

అంతకుముందు ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా ప్రశ్నలు సంధించారు. 'పదేళ్లు ఆయనే సీఎం' అని రేవంత్ ఎలా అంటారని ప్రశ్నించారు. పార్టీ లైన్ దాటి ఆయన చేసిన వ్యాఖ్యలపై ముందుగా వివరణ కోరాలని అన్నారు. తన కుమార్తె మాట్లాడిన విషయాలకు తనపై చర్యలు తీసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. ఎమ్మెల్యే టికెట్లు ఎవరికి ఇవ్వాలనేది రేవంత్ రెడ్డి ఎలా నిర్ణయిస్తారని నిలదీశారు.

**అధిష్టానానికి లేఖలు**

ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఇప్పటికే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు లేఖలు రాసినట్లు సురేఖ తెలిపారు. తనకు చెప్పాల్సిన విషయాలన్నీ పార్టీ పెద్దలకు చెప్పానని, ఇక అధిష్టానం తీసుకునే నిర్ణయాన్ని బట్టి తన తదుపరి ఆలోచన ఉంటుందని స్పష్టం చేశారు.

# గ్లోబల్ సమ్మిట్ రక్ష ఎక్స్‌పోలో భాగస్వాములు కండి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్ :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026'తో పాటు 'రక్షణ ఎక్స్‌పో2026'కు హాజరుకావాల్సిందిగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. బుధవారం దిల్లీలో కేంద్ర మంత్రితో భేటీ అయిన సీఎం సదస్సు నిర్వహణ, రాష్ట్రంలోని పలు రక్షణ రంగ ప్రాజెక్టులపై విస్తృతంగా చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఈ సమ్మిట్ జరగనుందని, అందులో భాగంగా నిర్వహించే 'రక్షణ ఎక్స్‌పో2026'ను ప్రారంభించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు రక్షణ శాఖ మంత్రి హాజరై మార్గనిర్దేశం చేస్తే వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు

**రక్షణ ఎక్స్‌పో భాగస్వామ్యం**

ఎయిర్‌షో నిర్వహణకు గగనతల అనుమతులతోపాటు భారత వైమానిక దళానికి చెందిన సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాల ప్రదర్శనలు ఉండేలా సహకరించాలని కోరారు. త్రివిధ దళాల ఉన్నతాధికారులు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రతినిధులు ఈ ఎక్స్‌పోలో పాల్గొనేలా చూడాలన్నారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు డీఆర్‌డీవో ల్యాబ్‌లు తమ సాంకేతికతను ప్రదర్శించేలా ప్రోత్సహించాలని కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వాములు కావాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

**డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు భూ కేటాయింపు**

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ చేపట్టనున్న ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని టీజీఐఐసీ ద్వారా 33 సంవత్సరాల కాలానికి, సంవత్సరానికి ₹1 నామమాత్రపు లీజు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎం తెలియజేశారు.

**ఆదిలాబాద్ విమానాశ్రయం**

విమానాశ్రయం కోసం ఇప్పటికే 750 ఎకరాలు సేకరించగా రక్షణ శాఖ విజ్ఞప్తి మేరకు మిగిలిన 750 ఎకరాలు (మొత్తం 1500 ఎకరాలు) కూడా సేకరించి ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర శక్తి శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం.అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేష్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు.

# విమానాశ్రయాల పనులు వేగవంతం చేయండి

- **రక్షణ, పౌర విమానయాన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయండి**
- **ఆదిలాబాద్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో వసతులు కల్పించండి**
- **కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**దిల్లీ, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్ :**

ఆదిలాబాద్, మామూనురు(వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని తెలిపారు. దిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో(మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రన్ వే ఫైనలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. మామునూరు ఎయిర్‌పోర్టు టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబరు నాటికి ఖరారు చేసి పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. హెలీ టూరిజంతో రాష్ట్రంలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలియజేశారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు. సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 18 గంటల కరెంట్ ఇవ్వాల్సిందే!

- **నందిన్నె సబ్‌స్టేషన్ వద్ద రైతుల ధర్నా.. సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి**
- **అధికారుల హామీతో ఆందోళన విరమణ**

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో | సెప్టెంబర్ 02 | ఆశ్వి అప్డేట్స్:**

వ్యవసాయానికి 18 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ గద్వాల నియోజకవర్గం కేటీ దొడ్డి మండలం నందిన్నె విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వ్యవసాయానికి నిరంతరాయంగా కరెంట్ అందించాలని రైతులు డిమాండ్ చేశారు.

ధర్నా విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వెంటనే నందిన్నెకు చేరుకుని రైతులకు సంఘీభావం తెలిపారు. రైతులతో కలిసి ధర్నాలో కూర్చుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల ఆందోళన నేపథ్యంలో విద్యుత్ శాఖ ఎస్ఈ, డీఈతో పాటు అధికారులు సబ్‌స్టేషన్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విద్యుత్ సరఫరా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులు, ఎమ్మెల్యే హామీతో రైతులు తమ ధర్నాను విరమించారు. వ్యవసాయానికి 18 గంటల విద్యుత్ సరఫరా విషయంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.







# ప్రకటనలకే పరిమితమైన కాంగ్రెస్ హామీలు: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

- **హామీల అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది**
- **రైతులను రోడ్డున పడేసిన రేవంత్ ప్రభుత్వం: నిరంజన్‌రెడ్డి**

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో | సెప్టెంబర్ 02 | ఆశ్వి అప్డేట్స్:**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, వివిధ హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. రాజీవ్ చౌరస్తాలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన నిరసన సభలో ఆయన మాట్లాడారు. 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, వెయ్యి రోజులు దాటుతున్నా వాటిని నెరవేర్చకుండా కేవలం ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. రైతులకు సాగునీరు, విద్యుత్ అందక ఇబ్బందులు పడుతున్నారని, యూరియా కోసం రోడ్లపై బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, రెండు లక్షల ఉద్యోగాలు వంటి హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ నీళ్లను ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ 420 అడుగుల భారీ ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చి సంక్షేమ పాలన అందిస్తుందని నిరంజన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వాకిటి శ్రీధర్, రమేష్ గౌడ్, బి. లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.




# కుట్టు మిషన్ల కొనుగోలు ప్రక్రియ 7లోపు పూర్తి చేయాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్:**

మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించే కుట్టు మిషన్ల పథకం దరఖాస్తులు, కొనుగోలు, టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటివరకు 1,80,170 దరఖాస్తులు అందగా, ఈ నెల 15 వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. 7వ తేదీలోపు ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియ పూర్తి చేసి, 15 తర్వాత ప్రీబిడ్ నిర్వహించాలని మంత్రి సూచించారు.

**గురుకులాలపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలోని 327 మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల్లో 22 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉన్న నేపథ్యంలో మిగిలిన వాటికి భవనాలు, స్థలాలపై ఈ నెల 15లోపు సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. యూనిఫాంలు, షూస్, ఇతర మౌలిక సదుపాయాల పరిస్థితిపైనా నివేదిక కోరారు. బీసీ కుల సంఘాల కార్పొరేషన్ల చైర్మన్లకు కార్యాలయాలు, మౌలిక సదుపాయాలు కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

**పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి**

ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి అర్హులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కళ్యాణ లక్ష్మి పథకంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించి లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించాలని సూచించారు. బీసీ స్టడీ సర్కిళ్లలో పోటీ పరీక్షలు, నైపుణ్య శిక్షణకు మెరుగైన విధానాలను రూపొందించాలని ఆదేశించారు.



**గీత కార్మికులకు రక్షణ కిట్లు**

శిక్షణ పూర్తి చేసిన గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను త్వరగా అందించాలని సూచించారు. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది గీత కార్మికులు ఉండగా, 40 వేల మంది శిక్షణ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. నీరా కేఫ్‌కు 7వ తేదీలోపు, నందనం ప్రాజెక్టుకు 15లోపు రీటెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

**ధోబీఘాట్ల ఏర్పాటుకు ప్రణాళిక**

ప్రతి నియోజకవర్గంలో అధునాతన ధోబీఘాట్ ఏర్పాటు చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. తొలి దశలో హుస్నాబాద్, హుజురాబాద్, చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## జన ఆకాంక్షల కేంద్రంగా

# వెయ్యి రోజుల పాలన

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్ :**

జన ఆకాంక్షలే కేంద్రంగా త్యాగాల ఆశయాలే ఇంధనంగా సాగిన వెయ్యి రోజుల ప్రజా ప్రస్థానం ఇది అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెయ్యి రోజుల పాలన సందర్భంగా 'ఎక్స్'లో పోస్టు చేశారు. పేదల అవసరాలను, వారి ఆత్మగౌరవాలను మేళవించి సంక్షేమం అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర దీర్ఘకాలిక భవితను, బిడ్డల ఉపాధిని మేళవించి అభివృద్ధి చేసి చూపిస్తున్నామన్నారు. సకల వర్గాల సామాజిక న్యాయాన్ని, సమాన అవకాశాలను మేళవించి సాగిస్తున్న పాలన వెయ్యి రోజుల ఈ ప్రయాణం అని ఆయన పేర్కొన్నారు. నాలుగు కోట్ల ప్రజల ఆశీస్సులు, లక్షలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తల అండతో తెలంగాణను విశ్వ వేదికపై విజయపతాకగా నిలిపే వరకు అవిశ్రాంతంగా ఈ కృషిని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రయాణంలో తోడుగా, నీడగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మీతో ఈ అనుబంధం నా గుండెల్లో శాశ్వతంగా నిలిచి ఉంటుంది అని సీఎం రేవంత్ అన్నారు.

# ప్రజా హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్

**దిల్లీ, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్ :**

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తనదైన ముద్ర వేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహా నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా దిల్లీలోని తన అధికారిక నివాసంలో ఆయన చిత్రపటానికి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సాగు నీటి ప్రాజెక్టులు, ఔటర్ రింగు రోడ్డు వంటి అభివృద్ధి పనులు, రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలతో పాలనపై చెరగని ముద్ర వేసిన నాయకుడు డాక్టర్ వైఎస్సార్ అని అన్నారు. కార్యక్రమంలో మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, ఎం.అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 420 హామీలతో

# ప్రజా ద్రోహం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేకపోయిందని, ఇది తెలంగాణ సమాజాన్ని ప్రతీ విషయంలోనూ మోసం చేసిన '420' ప్రభుత్వమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దిల్లీలో ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు, 420 సబ్‌గ్యారెంటీల పేరుతో ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం, గత వెయ్యి రోజుల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. హామీలు నెరవేర్చకపోగా రాష్ట్రాన్ని రూ.13 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టేశారని మండిపడ్డారు. పెండింగ్ బిల్లులు, పీఆర్సీ, ఆరు డీఏలను నిలిపివేసి ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. సరైన క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించకుండానే ఈహెచ్ఎస్ పేరుతో జీతాల నుంచి కోతలు విధించడం దుర్మార్గమని ఆయన ధ్వజమెత్తారు.

**మహిళలు, వృద్ధులు & నిరుద్యోగులు,**

**రైతాంగం, విద్యా రంగం**

మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులువితంతువులకు రూ.4,000 పెన్షన్ హామీల ముసుగులో మోసగించారని ఆరోపించారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. రూ.2 లక్షల పూర్తిస్థాయి రుణ మాఫీ చేయకుండా రైతులను నమ్మించి గొంతు కోశారని, రైతు భరోసా బకాయిలు దాదాపు రూ.57 వేల కోట్లకు చేరాయని తెలిపారు. విద్యా రంగానికి సంబంధించి రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. బీసీ సంక్షేమానికి కేటాయించిన రూ.60 వేల కోట్లను విడుదల చేయకపోగా కుల గణన పేరుతో నాటకమాడుతూ అన్యాయం చేశారని మండిపడ్డారు. వెయ్యి రోజుల పాలనపై ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాల పరిమితి ముగిసిన తర్వాత కాంగ్రెస్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# స్వదేశీ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి కావాలి

- **డీఆర్ డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి**
- **హైదరాబాద్‌లో రాఘవ ఏరోస్పేస్ ప్రారంభం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్ :**

భారతదేశ రక్షణ తయారీ రంగం గణనీయమైన ప్రగతిని సాధించిందని, దేశీయంగా ఉత్పత్తి చేసే ఆయుధాలను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి మన దేశం రూపాంతరం చెందిందని డెవలప్‌మెంట్‌కమ్‌ప్రొడక్షన్ భాగస్వామి, డీఆర్డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన రాఘవ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్ఏడీపీఎల్)ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఆత్మనిర్భర్ భారత్' చొరవ కింద కేంద్ర ప్రభుత్వం రక్షణ బడ్జెట్‌లో స్వదేశీ తయారీ కోసం ₹1.39 లక్షల కోట్లను కేటాయించిందని తెలిపారు. ఆర్మేనియా దేశం తన రిపబ్లిక్ డే పరేడ్‌లో మన దేశీయ ఆయుధ వ్యవస్థలను ప్రదర్శించడం గర్వకారణమన్నారు. రాఘవ ఏరోస్పేస్ సంస్థ కేవలం దేశీయ మార్కెట్‌పైనే కాకుండా అంతర్జాతీయ ఎగుమతులపై దృష్టి సారించాలని సూచించారు.

**కంపెనీ విశేషాలు**

ఆర్ఏడీపీఎల్ సంస్థ ఏరోస్పేస్, రక్షణ, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగాల్లో ఆర్ అండ్ డీ, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్, కాంపోజిట్ స్ట్రక్చర్స్‌పై పనిచేస్తుంది. దీని వద్ద అత్యాధునిక క్లీన్ రూమ్, మైక్రోవేవ్ టెస్టింగ్, కాంపోజిట్ తయారీ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. పెరిడాట్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్‌తో కలిసి మేల్300 జాయింట్ వెంచర్‌ను ప్రకటించింది. ఇది 300 కిలోల పేలోడ్, 30 గంటల ఓర్పుతో 30,000 అడుగుల ఎత్తు వరకు ఎగిరే స్వదేశీ డ్రోన్. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లిఖిత్ రెడ్డి పొంగులేటి మాట్లాడుతూ దేశీయ రక్షణ రంగానికి అవసరమైన ఉత్పత్తులను అందించడంతో పాటు అంతర్జాతీయ ఎగుమతి మార్కెట్లలో ముందంజలో ఉండటమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.





# నేపాల్‌లో ఘోర విషాదం

- **వరదల్లో 1,114 మంది మృతి.. 3,916 మంది గల్లంతు**

**కాఠ్మాండు, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్:**

చైనా-నేపాల్ సరిహద్దులో ఆగస్టు 26న సంభవించిన భారీ వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. నేపాల్‌లో వరదల కారణంగా ఇప్పటివరకు 1,114 మంది మృతి చెందగా.. 3,916 మంది గల్లంతైనట్లు ఆ దేశ విపత్తు నిర్వహణ అధికారులు బుధవారం వెల్లడించారు. వరదల ధాటికి పలు ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు, సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. ఇదిలా ఉండగా, చైనా అధికారిక మీడియా ప్రకారం టిబెట్‌లో వరదల కారణంగా 16 మంది మృతి చెందగా, మరో 546 మంది గల్లంతయ్యారు. దీంతో నేపాల్-టిబెట్ ప్రాంతంలో ఈ విపత్తు కారణంగా మొత్తం 1,130 మంది మృతి చెందగా, 4,462 మంది గల్లంతైనట్లు సమాచారం.

# కరీంనగర్ జిల్లాలో తప్పిన ఘోర ప్రమాదం

- **వ్యవసాయ బావిపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు.. త్రుటిలో తప్పిన పెను ప్రమాదం**

**కరీంనగర్, ఆశ్వి అప్డేట్స్:**



జిల్లాలో ఆర్టీసీ బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామ శివారులో ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి వ్యవసాయ బావిపైకి దూసుకెళ్లింది. కరీంనగర్ నుంచి హుస్నాబాద్‌కు ప్రయాణికులతో వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సు బావిపైకి దూసుకెళ్లడంతో ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అయితే అదృష్టవశాత్తు భారీ ప్రమాదం తప్పింది. పలువురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.



# గజ్వేల్‌లో బీఆర్ఎస్ నిరసన

**గజ్వేల్, సెప్టెంబర్ 2 (ఆశ్వి అప్డేట్స్):**

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో "బాకీ కార్డుల" పంపిణీ చేపట్టారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీల అమలుతీరును ప్రజలకు వివరించేందుకే బాకీ కార్డుల కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని వారు విమర్శించారు. గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి ఇంద్రపార్క్ చౌరస్తా వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం దుకాణ సముదాయాలు, చిరు వ్యాపారులు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దుకాణదారులు, గజ్వేల్ బస్టాండ్‌లోని ప్రయాణికులకు బాకీ కార్డులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రజలకు గుర్తు చేయడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం నిర్వహించినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేంద్ర ఉన్నతాధికారులతో సీఎస్ సంజయ్ భేటీ

- **పలు కీలక అంశాలపై చర్చ**

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్:**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో బుధవారం వరుస సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులు, అభివృద్ధి అంశాలపై ఆయా శాఖల కార్యదర్శులతో ఆయన విస్తృతంగా చర్చించారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కటికితాల శ్రీనివాస్, రహదారుల రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి వి.ఉమాశంకర్‌లను సీఎస్ వేర్వేరుగా కలిశారు. కేంద్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి కటికితాల శ్రీనివాస్‌తో జరిగిన భేటీలో తెలంగాణలో పట్టణాభివృద్ధి, నివాస గృహాల నిర్మాణం, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. రహదారుల రవాణా శాఖ కార్యదర్శి వి. ఉమాశంకర్‌తో సమావేశమై రాష్ట్రంలో రహదారి అనుసంధానతను పెంచడం, జాతీయ రహదారుల విస్తరణ, రవాణా మౌలిక వసతుల అభివృద్ధిపై సమీక్షించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మెరుగైన సమన్వయంతో రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు ఈ సమావేశాలు ఎంతగానో దోహదపడతాయని అధికారులు తెలిపారు.

# సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **సైబర్ జాగృత దివస్ పోస్టర్ విడుదల చేసిన అదనపు ఎస్పీ రాజేష్ మీనా**

**వికారాబాద్, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్:**

సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే సైబర్ జాగృత దివస్ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన పోస్టర్‌ను జిల్లా అదనపు ఎస్పీ శ్రీ రాజేష్ మీనా, IPS విడుదల చేశారు.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు, నకిలీ ఆఫర్లు, సోషల్ మీడియా తదితర మార్గాల ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, సందేశాలు, లింకులు, అనుమానాస్పద ఆఫర్లను నమ్మవద్దని సూచించారు.

"వినాయకుడు మనకు నేర్పే పాఠాలు - సైబర్ విజ్ఞానం కలిగి ఉండండి" అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌లో సైబర్ నేరాల నుంచి రక్షణకు పలు సూచనలు పొందుపరిచారు. OTP, UPI PIN, ATM PIN, CVV, పాస్‌వర్డ్ వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని, వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, ముఖ్యమైన పత్రాలను ఆన్‌లైన్‌లో పంచుకునేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడంతో పాటు www.cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ కాజోల్ జైస్వాల్, ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఆర్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





# అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత

- **400 క్వింటాళ్ల బియ్యం గుర్తింపు.. ఐచర్ వాహనం, డ్రైవర్ అదుపులో**

**రాయపోల్, సెప్టెంబర్ 2 (ఆశ్వి అప్డేట్స్):**

పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఐచర్ వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు తెల్లవారుజామున పట్టుకున్నారు. రైస్‌మిల్లుకు బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించి వాహనాన్ని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం ఉదయం సుమారు 5 గంటల సమయంలో మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండల పరిధిలో అధికారులు నిఘా ఏర్పాటు చేశారు. TS05 UC5599 నంబర్ గల ఐచర్ వాహనం శామీర్‌పేట నుంచి సిద్దిపేట వైపు వెళ్తుండటాన్ని గుర్తించిన అధికారులు దానిని వెంబడించారు. రాయపోల్ మండలం రామారం గ్రామంలోని మహాలక్ష్మి రైస్‌మిల్ వద్దకు వాహనం చేరుకోగానే అడ్డుకుని తనిఖీ చేశారు.

వాహనంలో సుమారు 120 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. అదే సమయంలో రైస్‌మిల్ పరిసరాల్లో మరో 280 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో మొత్తం సుమారు 400 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

వాహనం డ్రైవర్ మాలోత్ శ్రీకాంత్ యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన వ్యక్తిగా విచారణలో తేలింది. బియ్యాన్ని మహాలక్ష్మి రైస్‌మిల్‌లో అన్‌లోడ్ చేసేందుకు తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు. పీడీఎస్ బియ్యంతో పాటు ఐచర్ వాహనం, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. రైస్‌మిల్ యజమాని బచ్చు నాగరాజుకు సంబంధించిన వివరాలపై కూడా అధికారులు విచారణ చేపట్టారు. ఘటనపై పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత డీటీసీఎస్ అధికారులకు సమాచారం అందించారు. ఈ దాడిలో హైదరాబాద్ ఎస్పీ ఈటీఎఫ్ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ జి. అజయ్‌బాబు, రిటైర్డ్ ఎస్ఐ శ్రీశైలం, పీసీ ప్రభాకర్ పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్–65 వెంట పచ్చని చెట్లకు రక్షణ ఏదీ?

**చిట్యాల, సెప్టెంబర్ 2 (ఆశ్వి అప్డేట్స్):**

నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ పరిధిలో ఎన్‌హెచ్-65 వెంట పెట్రోల్ బంకులు, హోటళ్ల ఏర్పాటు కోసం పచ్చని చెట్లను తొలగిస్తున్నారని గ్రామ వార్డు సభ్యులు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా చెట్లను తొలగిస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

గతంలోనూ ఇదే విధంగా చెట్లను తొలగించిన సందర్భాల్లో గ్రామపంచాయతీ, అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా జరిమానా విధించడంతో పాటు తొలగించిన ప్రతి చెట్టుకు మూడు మొక్కలు నాటుతామని హామీ ఇచ్చారని వార్డు సభ్యులు తెలిపారు. ఆ హామీలు ఎంతవరకు అమలయ్యాయో అధికారులు స్పష్టం చేయాలని కోరారు.

ప్రభుత్వం హరితహారం, మొక్కల పెంపకం కోసం ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ నర్సరీల్లో మొక్కలు పెంచడం, రహదారుల వెంట నాటడం, ట్రీగార్డులు ఏర్పాటు చేయడం, వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీరు అందించడం, సంరక్షణ సిబ్బందిని నియమించడం వంటి చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఒకవైపు ఇంత ప్రజాధనం ఖర్చు చేసి పెంచిన చెట్లను మరోవైపు ప్రైవేటు సంస్థలు తమ అవసరాల కోసం తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చెట్ల తొలగింపుపై అధికారులు సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. హరితహారం లక్ష్యాన్ని కాపాడడంతో పాటు పచ్చదనం పరిరక్షణలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పెద్దకాపర్తి గ్రామ వార్డు సభ్యులు మర్రి హరీష్‌రెడ్డి, జల్ల ప్రశాంత్, ఏర్పుల మల్లేశ్వరి, వెంకన్న డిమాండ్ చేశారు.



# కొత్తవాళ్లు వచ్చి కాంగ్రెస్‌ను కబ్జా చేయాలని చూస్తే ఊరుకోను

- **సమయం వచ్చినప్పుడు బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు: కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి**

**నార్కట్‌పల్లి, సెప్టెంబర్ 2 (ఆశ్వి అప్డేట్స్):**

కాంగ్రెస్ పార్టీలోకి కొత్తగా వచ్చిన కొందరు పార్టీని కబ్జా చేయాలని చూస్తున్నారని, అలాంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోనని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సమయం వచ్చినప్పుడు తనను బ్రహ్మదేవుడు కూడా ఆపలేడంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల గ్రామంలో దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి రాజగోపాల్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ''సీఎం.. సీఎం అంటున్నారు.. సమయం వచ్చినప్పుడు బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు'' అంటూ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలోకి కొత్తగా వచ్చిన కొందరు పార్టీపై ఆధిపత్యం సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి అన్యాయం జరగకుండా తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. వైఎస్సార్ ఆశయాలే తనకు స్ఫూర్తి అని, ఆయన చూపిన బాటలోనే తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తానని తెలిపారు. తెలంగాణలో వైఎస్సార్‌కు లక్షలాది మంది అభిమానులు ఉన్నారని అన్నారు.



వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని, ఆయన ఆశయాల సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎన్ని కుట్రలు చేసినా తాము వైఎస్సార్ శిష్యులుగా ఆయనను మరవబోమని రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి నార్కట్‌పల్లి, చిట్యాల, రామన్నపేట, కేతేపల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# కొండపోచమ్మ రిజర్వాయర్‌లో మునిగి విద్యార్థి మృతి

- **రిజర్వాయర్‌లోకి దిగొద్దు.. ములుగు ఎస్సై రఘుపతి హెచ్చరిక**

**ములుగు, సెప్టెంబర్ 2 (ఆశ్వి అప్డేట్స్):**

కొండపోచమ్మ రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి బీకాం విద్యార్థి మృతి చెందిన విషాద ఘటన బుధవారం చోటుచేసుకుంది. సికింద్రాబాద్ ఓల్డ్ బోయినపల్లికి చెందిన నేపాలి మోహన్ ప్రసాద్ (18) బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మోహన్ ప్రసాద్ తన కళాశాలకు చెందిన క్లాస్‌మేట్స్ లోకేష్, ఆదిత్య బంగు, మేడ్చల్ శశాంక్, గట్టు ఆర్యన్, బురద దినేష్, మణికంఠ సాయిలతో కలిసి బుధవారం ఉదయం కళాశాల నుంచి బయలుదేరాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కొండపోచమ్మ రిజర్వాయర్‌కు చేరుకున్న విద్యార్థులు





లోపలి ప్రాంతంలోకి దిగి నీటిలో ఆడుతుండగా మోహన్ ప్రసాద్ ప్రమాదవశాత్తు లోతైన నీటిలో మునిగిపోయాడు. వెంటనే ములుగు పోలీసులకు, మృతుడి సోదరుడు నేపాలి మణికంఠకు



సమాచారం అందించారు. పోలీసులు, కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం మోహన్ ప్రసాద్ మృతదేహాన్ని నీటి నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు నేపాలి మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ములుగు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ములుగు ఎస్సై వి. రఘుపతి తెలిపారు.

**రిజర్వాయర్‌లోకి దిగొద్దు**

కొండపోచమ్మ రిజర్వాయర్‌లోని లోతైన, ప్రమాదకర ప్రాంతాల్లోకి ప్రజలు, సందర్శకులు దిగవద్దని పోలీసులు మరోసారి హెచ్చరించారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు. గతంలోనూ రిజర్వాయర్‌లో మునిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు సరదా కోసం నీటిలోకి దిగి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని పోలీసులు సూచించారు. ప్రజలు పోలీసుల హెచ్చరికలను తప్పనిసరిగా పాటిస్తూ రిజర్వాయర్ పరిసరాల్లో అప్రమత్తంగా ఉండాలని ములుగు పోలీసులు విజ్ఞప్తి చేశారు.






# వైఎస్సార్ వర్ధంతి వేడుకల్లో జక్కిడి ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

- **కాంగ్రెస్‌ను భ్రష్టు పట్టిస్తున్న మధుయాష్కిని ఎల్బీనగర్ నుంచి తరిమికొట్టే వరకు పోరాటం: జక్కిడి**

**ఎల్బీనగర్, ఆశ్వి అప్డేట్స్:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్‌లోని వైఎస్సార్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని, పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితో తాను నాలుగు దశాబ్దాలుగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల కోసం పని చేస్తున్నానని తెలిపారు. ఎల్బీనగర్‌లో వైఎస్సార్ విగ్రహ ఏర్పాటు విషయంలో మధుయాష్కీ అడ్డంకులు సృష్టించినప్పటికీ వాటిని అధిగమించి విగ్రహాన్ని ఏర్పాటు చేశానని జక్కిడి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మధుయాష్కీ తనపై వ్యక్తిగత కక్ష పెంచుకుని, కల్పిత ఆడియోలతో కుట్రలు చేసి పార్టీ పెద్దలపై ఒత్తిడి తీసుకువచ్చి తనను సస్పెండ్ చేయించారని ఆరోపించారు. మధుయాష్కీ, ఆయన అనుచరులపై పలు సంచలన ఆరోపణలు చేసిన ఆయన.. ఎల్బీనగర్‌లో విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. మసాజ్ సెంటర్ల ఏర్పాటు ద్వారా యువతను తప్పుదారి పట్టిస్తున్నారని, కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల విషయంలోనూ అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ అంశాలకు సంబంధించి తన వద్ద ఆధారాలు ఉన్నాయని, సరైన సమయంలో ప్రత్యేక మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడిస్తానని తెలిపారు. మధుయాష్కీ భవిష్యత్‌లో పీసీసీ అధ్యక్షుడు, మంత్రి, ముఖ్యమంత్రి పదవులు వస్తాయని ఊహల్లో విహరిస్తున్నారని జక్కిడి విమర్శించారు. ప్రజాక్షేత్రంలో బలం లేని నాయకుడికి పదవులు అప్పగిస్తే వ్యక్తిగత ప్రయోజనం తప్ప పార్టీకి ప్రయోజనం ఉండదన్నారు. మధుయాష్కీకి ఎల్బీనగర్ ప్రజలపై నిజమైన ప్రేమ లేదని, కేవలం కలెక్షన్ల కోసమే ఇక్కడికి వస్తున్నారని ఆయన ఆరోపించారు. 18 డివిజన్లు ఉన్న ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ బలహీనపడటానికి స్థానిక నాయకత్వమే కారణమని పేర్కొంటూ పార్టీ పెద్దలు దీనిపై ఆలోచించాలని సూచించారు. కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని ఎవరైనా భ్రష్టు పట్టిస్తే సహించేది లేదని, తాను చివరి వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని జక్కిడి ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ పార్టీని కాపాడేందుకు, మధుయాష్కీని ఎల్బీనగర్ నుంచి తరిమికొట్టే వరకు తన పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ ఆశయ ప్రాజెక్టులను పూర్తి చేసి తెలంగాణకు అంకితం చేస్తాం

- **ప్రాణహిత–చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (ఆశ్వి అప్డేట్స్):**

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయమైన ప్రాణహిత-చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేసి తెలంగాణ సమాజానికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో డాక్టర్ వైఎస్సార్-డాక్టర్ కేవీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అవార్డు-2026 ప్రదానోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. భారతీయ వ్యవసాయం, ఆహార భద్రత, సుస్థిర అభివృద్ధి, గ్రామీణ జీవనోపాధి రంగాల్లో విశేష కృషి చేస్తున్న ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..రైతులు, పేదల కోసం జీవితాంతం పరితపించిన వైఎస్సార్‌ను స్మరించుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. తెలంగాణలో సుమారు 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో వైఎస్సార్ ఆశయంగా భావించిన ప్రాజెక్టులను పూర్తి చేస్తామని తెలిపారు.

**రైతుల కోసం వైఎస్సార్ ఎన్నో కీలక నిర్ణయాలు**

2003లో మండుటెండల్లో ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వైఎస్సార్ చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్రను సీఎం గుర్తుచేశారు. రైతుల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు ఉచిత విద్యుత్ అందించాలని ఆయన నిర్ణయించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం చేసిన గొప్ప నాయకుడు వైఎస్సార్ అని రేవంత్‌రెడ్డి అన్నారు. రైతులపై ఉన్న రూ.1,300 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేయడంతో పాటు రైతులపై నమోదైన కేసులను ఎత్తివేసిన ఘనత కూడా వైఎస్సార్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. రైతుల గుండెల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.

వైఎస్సార్ చివరి కోరికలను నెరవేర్చేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సీఎం పిలుపునిచ్చారు.

**పేదలకు ఆహార భద్రతకు పీడీఎస్ పునాది**

గ్రామీణ నిరుపేదలకు కనీస ఆహార భద్రత కల్పించాలనే ఉద్దేశంతో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)ను తీసుకొచ్చారని సీఎం వివరించారు. పేదలకు బియ్యం, గోధుమలు, ఇతర నిత్యావసరాలను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అప్పట్లో చేపట్టిన చర్యలే నేటి ఆహార భద్రతకు పునాదిగా నిలిచాయని అన్నారు. తెలంగాణలో ప్రస్తుతం 3.40 కోట్ల మందికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని, ఇది ఆనాడు కాంగ్రెస్ ప్రారంభించిన పీడీఎస్ విధానం వల్లే సాధ్యమైందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, ఎంపీ జైరాం రమేష్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌గౌడ్, కేవీపీ ఫౌండేషన్ అధ్యక్షుడు కేవీపీ రామచందర్‌రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




# జహీరాబాద్‌లో బీఆర్ఎస్ సమరభేరి

**జహీరాబాద్, సెప్టెంబర్ 2 (ఆశ్వి అప్డేట్స్):**

కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జహీరాబాద్ నియోజకవర్గ కేంద్రంలో బుధవారం భారీ ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు నేతృత్వం వహించారు.

ధర్నాలో కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను ఎండగడుతూ ఏర్పాటు చేసిన "420 మోసాలు" భారీ బ్యానర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేస్తుందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని మాణిక్ రావు స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ప్రజల తరఫున మరింత ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. ధర్నాకు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో జహీరాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ శివకుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండప్ప, ఆత్మ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, సంజీవ్‌రెడ్డి, నర్సింలు, మున్సిపల్ మాజీ చైర్మన్లు అల్లాడి నర్సింలు, తంజిం, సీనియర్ నాయకులు నామా రవికిరణ్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.



# చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అవసరం

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్:**

చిన్న వయస్సు నుంచే పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చడం ఎంతో అవసరమని ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) డైరెక్టర్ డాక్టర్ భారతి కులకర్ణి అన్నారు. రెండు సంవత్సరాల్లోపు పిల్లలకు అదనపు చక్కెర ఇవ్వకూడదని భారతీయుల కోసం రూపొందించిన ఆహార మార్గదర్శకాలు సూచిస్తున్నాయని తెలిపారు.

ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) నిర్వహిస్తున్న హైదరాబాద్ ప్రెస్ టూర్‌లో భాగంగా ఉత్తరాఖండ్‌కు చెందిన 15 మంది సభ్యుల మీడియా ప్రతినిధి బృందం బుధవారం హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్-ఎన్ఐఎన్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా పోషకాహార పరిశోధనలు, ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాలు, జాతీయ విధానాలు, సంక్షేమ కార్యక్రమాలకు సంస్థ అందిస్తున్న శాస్త్రీయ సమాచారంపై మీడియా ప్రతినిధులకు అవగాహన కల్పించారు.

ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి డాక్టర్ భారతి కులకర్ణి మాట్లాడుతూ.. ఆహార కూర్పు, పోషక అవసరాలు, ఆహార మార్గదర్శకాలపై శాస్త్రీయ ఆధారాలను రూపొందించడంలో ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. దేశీయ ఆహార పదార్థాల్లోని శక్తి, ప్రోటీన్, సూక్ష్మపోషకాలు, ఖనిజాల వివరాలను అందించే ఇండియన్ ఫుడ్ కంపోజిషన్ టేబుల్స్ (ఐఎఫ్‌సీటీ) పరిశోధకులు, ఆహార పరిశ్రమ, ప్రజారోగ్య విధాన రూపకర్తలకు కీలక రిఫరెన్స్‌గా ఉపయోగపడుతున్నాయని వివరించారు.

వివిధ వయస్సులు, శారీరక వర్గాల ప్రజలకు అవసరమైన పోషకాహార ప్రమాణాలను నిర్ధారించే సిఫార్సు చేసే ఆహార భత్యాలు (ఆర్‌డీఏలు) దేశ పోషకాహార కార్యక్రమాలకు పునాదిగా నిలుస్తున్నాయని తెలిపారు.

ఆధునిక జీవనశైలి కారణంగా కొవ్వు, చక్కెర, ఉప్పు అధికంగా ఉండే ఆహార పదార్థాలను అధికంగా తీసుకోవడం వల్ల ముఖ్యంగా పిల్లల్లో అధిక బరువు, ఊబకాయం వంటి సమస్యలు పెరుగుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఆహారం అందుబాటులో ఉండటం మాత్రమే పోషకాహార భద్రతకు హామీ కాదని, ఆహార వైవిధ్యం, సరైన ఆహారపు అలవాట్లు, ప్రవర్తనా మార్పు ప్రజారోగ్యానికి కీలకమని స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్‌లో విస్తృతంగా వినియోగించే మండువా, ఝంగోరా, చోళై, కోడా వంటి దేశీయ పంటలు, చిరుధాన్యాల పోషక విలువలపై పరిశోధనలు కొనసాగుతున్నాయని డాక్టర్ భారతి తెలిపారు. రాగి వినియోగం వల్ల రక్తహీనత సమస్య తగ్గుతుందా అనే అంశంపై వైద్యపరమైన, విశ్లేషణాత్మక అధ్యయనాలు కూడా కొనసాగుతున్నాయని వెల్లడించారు.

**పోషకాహార సమాచారంపై సాంకేతిక సమావేశాలు**

ఐసీఎంఆర్-ఎన్ఐఎన్‌లోని పోషకాహార సమాచారం, కమ్యూనికేషన్-ఆరోగ్య విద్య (ఎన్ఐసీహెచ్‌ఈ) విభాగం అధిపతి, శాస్త్రవేత్త-జి డాక్టర్ సుబ్బారావు ఎం. గవరవరపు ఆధ్వర్యంలో నిర్వహించిన సాంకేతిక సమావేశాలకు మీడియా బృందం హాజరైంది. పోషకాహార లోపాలు, సూక్ష్మపోషకాల లోపాలు, జీవనశైలి కారణంగా ఏర్పడే జీవక్రియ సంబంధిత రుగ్మతల మధ్య ఉన్న సంబంధాన్ని ఆయన వివరించారు. శాస్త్రీయ పోషకాహార సమాచారం ప్రజల రోజువారీ ఆహారపు అలవాట్లకు చేరేలా చేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ఆధారాలు లేని ఆహారపు ట్రెండ్లను ప్రోత్సహించకుండా, శాస్త్రీయ ఆధారాలతో కూడిన ఆహార పద్ధతులపై బాధ్యతాయుతంగా రిపోర్టింగ్ చేయాలని సూచించారు.

**ప్రయోగశాలలు, సాలార్‌జంగ్ మ్యూజియం సందర్శన**

మీడియా ప్రతినిధులు ఐసీఎంఆర్-ఎన్ఐఎన్‌లోని అధునాతన ప్రయోగశాలలను సందర్శించి ఆహార విశ్లేషణ, లిపిడ్ కెమిస్ట్రీ తదితర రంగాల్లో జరుగుతున్న పరిశోధనలను పరిశీలించారు. పరిశోధకులతో నేరుగా మాట్లాడి పరిశోధనలపై వివరాలు తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియాన్ని కూడా సందర్శించింది. మ్యూజియంలోని చారిత్రక, పురావస్తు సంపదను పరిశీలించిన జర్నలిస్టులకు హైదరాబాద్ చారిత్రక వారసత్వంపై అవగాహన కల్పించారు





# యశోద ఆసుపత్రిలో నాగం శ్రీదేవిని పరామర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**నల్లగొండ, ఆశ్వి అప్డేట్స్:**

గుండెపోటుకు గురై సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి తల్లి నాగం శ్రీదేవిని కేంద్ర మంత్రి బండి సంజయ్ పరామర్శించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ జి. మనోహర్ రెడ్డి, జె. సంగప్పలతో కలిసి ఆసుపత్రికి చేరుకున్న ఆయన శ్రీదేవి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డిని పరామర్శించిన బండి సంజయ్ ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. శ్రీదేవి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటీవల డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసి ఇంటిని ధ్వంసం చేశారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న నాగం శ్రీదేవిపైనా దాడి జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ ఘటన అనంతరం ఆమెకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



# సమాచార శాఖ అదనపు డైరెక్టర్ జగన్‌కు టీడబ్ల్యూజేఎఫ్ సన్మానం

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

సమాచార, పౌరసంబంధాల శాఖ అదనపు డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన డీఎస్ జగన్‌ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ అభినందించింది. బుధవారం హైదరాబాద్‌లోని సమాచార్ భవన్‌లో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య ఆధ్వర్యంలో ప్రతినిధులు జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ.. జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమం కోసం జగన్ దీర్ఘకాలంగా కృషి చేశారని కొనియాడారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కోరారు. పదోన్నతితో బాధ్యతలు మరింత పెరిగిన నేపథ్యంలో జర్నలిస్టులు, సమాచార శాఖ మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. అలాగే జిల్లాల్లో అక్రిడిటేషన్ల జారీ విషయంలో డీపీఆర్‌వోలు జాప్యం చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జగన్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య 'రాజ్యాంగం మనకేమిచ్చింది' పుస్తకాన్ని జగన్‌కు బహూకరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్గోయి ప్రభాకర్, తాటికొండ కృష్ణ, బి. రాజశేఖర్, కార్యదర్శి గండ్ర నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలంటూ.. 1000 రోజులు గడిచినా అమలు ఏది?

- **ఇచ్చిన హామీలు నెరవేర్చాకే నకిరేకల్ నియోజకవర్గంలో అడుగుపెట్టాలి: బీజేపీ నేత గుండాల నరేష్ గౌడ్**

**చిట్యాల, సెప్టెంబర్ 2 (ఆశ్వి అప్డేట్స్):**

"100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 1000 రోజులు గడిచినా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయింది" అని బీజేపీ చిట్యాల పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్ గౌడ్ విమర్శించారు.

మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించిన మహాలక్ష్మి పథకం, రైతులకు ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా, కౌలు రైతులకు సహాయం, వరి క్వింటాలుకు రూ.500 బోనస్ వంటి హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆయన ఆరోపించారు.

విద్యార్థులు, నిరుద్యోగ యువతకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డులు, జాబ్ క్యాలెండర్ వంటి హామీల విషయంలోనూ ప్రభుత్వం విఫలమైందని నరేష్ గౌడ్ విమర్శించారు. వృద్ధులు, వికలాంగులకు రూ.4 వేల పెన్షన్, సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం వంటి హామీలను కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని అన్నారు.

కాలేజీ విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని ఆయన ఆరోపించారు.

హామీల అమలు కోసం నిరుద్యోగ యువత, విద్యార్థులు ఆందోళనలు చేస్తుంటే లాఠీచార్జీలు చేయడం, ప్రతిపక్ష నాయకుల ఇళ్ల వద్ద పోలీసులను మోహరించడం, హౌస్ అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని నరేష్ గౌడ్ అన్నారు. ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధ పాలన సాగిస్తోందని విమర్శించారు.

**నకిరేకల్ నియోజకవర్గంపై నిర్లక్ష్యం**

నల్గొండ జిల్లాలోని నకిరేకల్ నియోజకవర్గం, ముఖ్యంగా చిట్యాల మండల కేంద్రం అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని నరేష్ గౌడ్ డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నియోజకవర్గంలో పర్యటించడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, చిట్యాల మండల కేంద్రానికి అభివృద్ధి పనులు తీసుకువచ్చిన తర్వాతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నకిరేకల్ నియోజకవర్గంలో అడుగుపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్ గౌడ్ హెచ్చరించారు.





# నేపాల్‌లో మళ్లీ వర్షాలు

- ఉప్పొంగుతున్న మూడు ప్రధాన నదులు

**ఖాట్మాండ్, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్ :**

నేపాల్‌కు మరోసారి వరద ముప్పు పొంచి ఉంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా మూడు ప్రధాన నదులలో నీటి మట్టాలు డేంజర్ మార్క్‌ను దాటాయి. నేపాల్ వరద అంచనా విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం 6 గంటల సమయంలో సున్ కోషి, బుధి గండకి, మహాకాళి నదులలో నీటి మట్టాలు హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. లామ్‌జంగ్ జిల్లాలోని మార్స్యాంగ్డి నదిలో కూడా నీటి మట్టం మంగళవారం అర్ధరాత్రి డేంజర్ మార్క్ దాటిందని అధికారులు వెల్లడించారు. ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ సూచించింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో నిరంతరం వర్షాలు కురుస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. బుధవారం నాటికి నేపాల్, టిబెట్‌లలో కలిపి మరణాల సంఖ్య 1,130కి పెరిగింది. ఇప్పటివరకు 1,113 మృతదేహాలకు పోస్టుమార్టం, చట్టపరమైన గుర్తింపు ప్రక్రియలు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. 95 మృతదేహాలను బంధువులకు అప్పగించామన్నారు. గుర్తింపు లేని 911 మృతదేహాల వివరాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ఇప్పటివరకు 6,541 మందిని రక్షించగా 4,858 మంది గల్లంతయ్యారు. 7,912 మంది సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు.



# భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో పురోగతి

- ఈ నెలాఖరులో అమెరికా పర్యటనకు పీయూష్ గోయల్
- పరస్పర ప్రయోజనకర వాణిజ్య సంబంధంపై దృష్టి
- వాణిజ్యానికి మించి సాంకేతికత, పెట్టుబడులపై సహకారం
- 'ప్యాక్ట్ సిలికా'తో పెట్టుబడులకు ఊతం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్:**

భారత్‌అమెరికా దేశాలు న్యాయమైన, పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య సంబంధాన్ని నిర్మించేందుకు సన్నిహితంగా పనిచేస్తున్నాయని భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య అవగాహనపై ఇప్పటికే గణనీయమైన పురోగతి సాధించామని వెల్లడించారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్ ఈ నెలాఖరులో అమెరికా పర్యటనకు వెళ్లనున్నట్లు చెప్పారు.

**వాణిజ్య చర్చలు కొనసాగింపు**

ఆటోమోటివ్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 66వ వార్షిక సమావేశంలో మాట్లాడిన సెర్గియో గోర్.. భారత్‌అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య అవగాహనతో పాటు పలు అంశాల్లో వాస్తవమైన పురోగతి సాధించామని తెలిపారు. జీ20 చర్చల నేపథ్యంలో పీయూష్ గోయల్ అమెరికాతో చర్చలను కొనసాగిస్తారని చెప్పారు.

**అన్ని రంగాల్లో సహకారం**

ఇరు దేశాల మధ్య పురోగతి వస్తువుల వాణిజ్యానికే పరిమితం కాలేదని గోర్ అన్నారు. సాంకేతికత, పెట్టుబడులు, ఆవిష్కరణలు సహా దాదాపు అన్ని రంగాల్లో భారత్, అమెరికా కలిసి పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

**'ప్యాక్ట్ సిలికా'తో పెట్టుబడులకు ఊతం**

ఈ ఏడాది భారత్, అమెరికా 'ప్యాక్ట్ సిలికా' డిక్లరేషన్‌పై సంతకం చేశాయని గోర్ తెలిపారు. ఆవిష్కరణలకు అనుకూలమైన నియంత్రణ వ్యవస్థ ఏర్పాటుకు ఇది కీలక ముందడుగని అన్నారు. ఇరు దేశాల కంపెనీలు పరస్పరం సరిహద్దులు దాటి పెట్టుబడులు పెట్టుకునేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. కొత్త తరం పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు కూడా మరిన్ని అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

# ఘనంగా 'జాతీయ సైబర్ జాగరూకతా దివస్'

- 438 అవగాహనా కార్యక్రమాలు
- టీజీసీఎస్‌బీ హెచ్చరిక

**హైదరాబాద్, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్:**

పౌరుల్లో సైబర్ అవగాహనను పెంచడం, సురక్షితమైన డిజిటల్ పద్ధతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 'జాతీయ సైబర్ జాగరూకతా దివస్' ఘనంగా నిర్వహించారు.. ప్రతినెలా మొదటి బుధవారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా డిజిటల్ పేమెంట్స్, ఆన్లైన్ షాపింగ్ ఫ్రాడ్స్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ వంటి అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా TGCSB తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రత్యేక ప్రచార సామగ్రిని అన్ని పోలీసు స్టేషన్లకు అందించింది. లా అండ్ ఆర్డర్ పోలీసులు, సంబంధిత విభాగాల అధికారులు ఈ డ్రైవ్‌లో చురుగ్గా పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 438 కార్యక్రమాలు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుల్లో దాదాపు 82,573 మంది పౌరులు పాల్గొన్నారు.

**బాధితులు వెంటనే స్పందించాలి**

ఆన్‌లైన్ షాపింగ్ చేసే సమయంలో విక్రేతలను, వెబ్‌సైట్లను సరిచూసుకోవాలని, అపరిచిత లింక్‌లను క్లిక్ చేయవద్దని పోలీసులు సూచించారు. ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే గోల్డెన్ అవర్ (కీలక సమయం)లో వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా www.cybercrime.gov.in పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న సొమ్మును తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని టీజీసీఎస్‌బీ పేర్కొంది.

# ఖర్గేకు అవమానంపై ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఆగ్రహం

- 'శుద్ధీకరణ'ను తీవ్రంగా ఖండించిన ఎంపీలు
- 8న రాష్ట్రపతిని కలవాలని నిర్ణయం
- 7న ఇందిరా భవన్‌లో కార్యాచరణపై భేటీ
- బాధ్యులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్ :**

రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో చోటుచేసుకున్న ఘటనపై కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు సభ్యులు, సీనియర్ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఖర్గే పర్యటన అనంతరం శుద్ధీకరణ చర్యపై ఎస్సీ, ఎస్టీ పార్లమెంటు సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన కేవలం ఖర్గేను వ్యక్తిగతంగా అవమానించడమే కాదని, మొత్తం ఎస్సీ, ఎస్టీ సమాజం గౌరవం, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యగా వారు అభివర్ణించారు. సమానత్వం, వ్యక్తిగత గౌరవం, అంటరానితనం నిర్మూలన వంటి రాజ్యాంగ సూత్రాలకు ఇలాంటి చర్యలు విరుద్ధమన్నారు. ఈ అంశంపై ఎస్సీ, ఎస్టీ పార్లమెంటు సభ్యులు దిల్లీలో బుధవారం సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై న్యాయం జరిగేలా, బాధ్యులపై తగిన చర్యలు తీసుకునేలా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జోక్యం చేసుకోవాలని ఈ ఎంపీలు కోరేందుకు 8వ తేదీన రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరాలని నిర్ణయించారు. రాష్ట్రపతికి అనుకూలమైన ఇతర తేదీ, సమయం కుదిరినా ప్రతినిధి బృందం ఆమెను కలిసి ఈ అంశాన్ని స్వయంగా వివరించనుంది.

**ఇందిరా భవన్‌లో 7న కీలక భేటీ**

రాష్ట్రపతిని కలిసే ముందు తదుపరి కార్యాచరణకు సంబంధించి రోడ్ మ్యాప్ రూపొందించేందుకు 7వ తేదీ ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీలందరూ సమావేశం కావాలని నిర్ణయించారు. అనంతరం 8న రాష్ట్రపతిని కలిసి ఈ అంశాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లనున్నారు.



**రాజ్యాంగ విలువల పరిరక్షణకు పోరాటం**

రాజ్యాంగం కల్పించిన సమానత్వం, గౌరవం, హక్కులను పరిరక్షించేందుకు ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధ మార్గాల్లో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ అంశాన్ని అత్యున్నత రాజ్యాంగ స్థాయికి తీసుకెళ్లి న్యాయం సాధించే వరకు సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు. నాగర్‌కర్నూల్ (ఎస్సీ) నియోజకవర్గం ఎంపీ డా.మల్లు రవి ఈ వ్యవహారంపై రాష్ట్రపతికి లేఖ సమర్పించారు. తగిన జోక్యం చేసుకుని, బాధ్యులపై చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. సమావేశానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ జార్ఖండ్ ఇన్‌చార్జి కె.రాజు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ససారం ఎంపీ మనోజ్ కుమార్, తురా ఎంపీ సలెంగ్ ఎ.సంగ్మా, కోరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక తదితరులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. ఫతేగఢ్ సాహిబ్ ఎంపీ అమర్ సింగ్, టోంక్‌సవాయ్ మాధోపూర్ ఎంపీ హరీశ్ చంద్ర మీనా, వరంగల్ ఎంపీ కడియం కావ్య, బారాబంకీ ఎంపీ తనూజ్ పునియా తదితరులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు.

# రామ మందిర నిర్వహణ అద్భుతంగా సాగింది

- చిన్నపాటి సమస్యలు మినహా ఇబ్బందుల్లేవు
- తొలి సీఈవోగా రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా
- విరాళాల వ్యవహారంపై కొనసాగుతున్న దర్యాప్తు
- 5,585 దరఖాస్తుల్లో మిశ్రా ఎంపిక

**అయోధ్య, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్:**

అయోధ్య రామ మందిర నిర్వహణ, పరిపాలన ఇప్పటివరకు అత్యంత అద్భుతంగా సాగిందని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కొత్త సీఈవోగా నియమితులైన రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా అన్నారు. అక్కడక్కడా ఎదురైన చిన్నపాటి సమస్యలు మినహా ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. కొన్ని అంశాలపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోందని, వాటి ఫలితాల కోసం వేచి చూడాల్సి ఉందన్నారు.

**బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తా**

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వైమానిక దళం వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌కు నాయకత్వం వహించిన జితేంద్ర మిశ్రాను రామ మందిర ట్రస్ట్ తొలి సీఈవోగా నియమించింది. ఆలయ నిర్వహణ, పరిపాలనా వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ఈ పదవిని కొత్తగా ఏర్పాటు చేశారు. అప్పగించిన బాధ్యతలను ట్రస్ట్ మార్గదర్శకత్వం, తన బృందం సహకారంతో సమర్థంగా నిర్వహించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని మిశ్రా తెలిపారు.

**5,585 దరఖాస్తుల్లో ఎంపిక**

ఆలయ విరాళాల దుర్వినియోగ ఆరోపణల నేపథ్యంలో సీఈవో నియామక ప్రక్రియ చేపట్టారు. మొత్తం 5,585 దరఖాస్తులు అందగా.. ఏఐ ఆధారిత స్క్రీనింగ్, మాన్యువల్ మూల్యాంకనం అనంతరం అభ్యర్థులను ఎంపిక చేశారు. చివరకు ముగ్గురితో కూడిన తుది జాబితా నుంచి జితేంద్ర మిశ్రాను ఎంపిక చేశారు. రిటైర్డ్ జస్టిస్ ప్రమోద్ కోహ్లీ నేతృత్వంలోని కమిటీ ఈ ప్రక్రియను పర్యవేక్షించింది.

**39 ఏళ్లకు పైగా వైమానిక దళంలో సేవలు**

ఉత్తరప్రదేశ్‌లోని దేవరియా జిల్లాకు చెందిన జితేంద్ర మిశ్రా 2026 ఏప్రిల్‌లో వైమానిక దళం నుంచి రిటైరయ్యారు. 39 ఏళ్లకు పైగా సేవలందించిన ఆయన ఫైటర్ పైలట్‌గా 3,000 గంటలకు పైగా విమాన ప్రయాణ అనుభవం పొందారు. కమాండ్, వ్యూహాత్మక ప్రణాళిక, పరీక్షా విభాగాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్‌లో సేవలకు గుర్తింపుగా సర్వోత్తమ యుద్ధ సేవా మెడల్‌తో పాటు అతి విశిష్ట సేవా మెడల్, విశిష్ట సేవా మెడల్ అందుకున్నారు.




**పరిపాలనపై దృష్టి**

ఆలయ విరాళాల సొమ్ము దుర్వినియోగం ఆరోపణల కేసులో ఎనిమిది మంది అరెస్టు కాగా, ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కొత్త సీఈవో నియామకంతో ఆలయ పరిపాలనను మరింత వ్యవస్థీకృతం చేయడంపై ట్రస్ట్ దృష్టిసారించింది. జితేంద్ర మిశ్రా సైనిక రంగంలో పొందిన విస్తృత పరిపాలనా, నాయకత్వ అనుభవం ఈ బాధ్యతల్లో ఉపయోగపడుతుందని భావిస్తోంది.

# మహిళలను ఇళ్లకే పరిమితం చేయలేం

- గ్రాండ్ ముఫ్తీ వ్యాఖ్యలను అంగీకరించం: సతీషన్
- మహిళలు అన్ని రంగాల్లో చురుగ్గా ఉండాలి
- మత పెద్దల ఆదేశాలతో బాలికలను నిర్బంధించలేం
- కాంగ్రెస్, సీపీఎంలపై రాజీవ్ చంద్రశేఖర్ విమర్శలు

**తిరువనంతపురం, ఆశ్వి అప్డేట్స్:**

మహిళలు ఇళ్లకే పరిమితం కావాలంటూ కేరళ గ్రాండ్ ముఫ్తీ కాంతపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేగింది. మహిళలు ప్రజాజీవితంలోకి వస్తే తీవ్ర నష్టం జరుగుతుందని, వారు విధేయులుగా ఇళ్లలోనే ఉండాలని ఖురాన్ చెబుతోందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలను కేరళ ప్రతిపక్ష నేత వీడీ సతీషన్ తీవ్రంగా ఖండించారు. ఈ వైఖరిని తమ పార్టీ, ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించవని స్పష్టం చేశారు.

**మహిళలు అన్ని రంగాల్లో ఉండాలి**

మహిళలు సమాజంలోని అన్ని రంగాల్లో చురుగ్గా పాల్గొనాలన్నదే తమ ప్రగతిశీల వైఖరి అని సతీషన్ అన్నారు. మహిళలు అణచివేతకు గురై ఇళ్లకే పరిమితం కావాలన్న భావన 19వ శతాబ్దపు ఆలోచనగా అభివర్ణించారు. మహిళలు ప్రజా, సామాజిక జీవితంలో స్వేచ్ఛగా పాల్గొనాలని స్పష్టం చేశారు.

**ఇస్లాం బోధనలకు విరుద్ధం**

గ్రాండ్ ముఫ్తీ వ్యాఖ్యలు ఇస్లాం బోధనలకు సరైన ప్రతిరూపం కాదని సతీషన్ అన్నారు. ప్రవక్త మహమ్మద్ తొలి భార్య ప్రముఖ వ్యాపారవేత్తగా ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. అలాగే ఆయిషా 'బ్యాటిల్ ఆఫ్ ది క్యామెల్'లో కీలక పాత్ర పోషించారని, రాణి బిల్కిస్ పాలకురాలిగా ఉన్నారని పేర్కొన్నారు.

**బీజేపీ నుంచి విమర్శలు**

గ్రాండ్ ముఫ్తీ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ కూడా స్పందించారు. మత పెద్దల ఆదేశాలతో కేరళ బాలికలను మధ్యయుగపు నిర్బంధంలోకి నెట్టలేరని అన్నారు. కాంగ్రెస్, సీపీఎంలు బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. మహిళలు పితృస్వామ్య భావజాలాన్ని వ్యతిరేకించాలని చెబుతున్న రాహుల్ గాంధీ.. గ్రాండ్ ముఫ్తీ వ్యాఖ్యలను ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు.



# 'నన్ను ఉరితీయక ముందే నిన్ను విముక్తి చేస్తా''..

- భార్య ముషాల్‌కు విడాకులు ఇవ్వాలని నిర్ణయం
- తీహార్ జైలు నుంచే అఫిడవిట్ దాఖలు
- 'ఆమె కొత్త జీవితాన్ని ప్రారంభించాలి'
- 2009లో వివాహం.. ఇద్దరి మధ్య 20 ఏళ్ల వ్యత్యాసం

**శ్రీనగర్, సెప్టెంబర్ 2, ఆశ్వి అప్డేట్స్:**

జమ్మూ కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జేకేఎల్ఎఫ్) ఉగ్రవాది యాసిన్ మాలిక్ తన భార్య ముషాల్ మాలిక్‌కు విడాకులు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించాడు. ఢిల్లీలోని తీహార్ జైలులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న ఆయన శ్రీనగర్‌లోని టాడా/పోటా కోర్టులో 25 పేజీల అఫిడవిట్ దాఖలు చేసినట్లు సమాచారం. అందులో భార్య నుంచి విడిపోవాలనే నిర్ణయాన్ని వెల్లడించాడు.

**కొత్త జీవితాన్ని ప్రారంభించాలి**

తన భార్య మిగిలిన జీవితాన్ని ప్రస్తుత పరిస్థితుల్లో భారంగా గడపడం తనకు ఇష్టం లేదని యాసిన్ మాలిక్ పేర్కొన్నాడు. ఆమె గౌరవంగా, ఆశతో జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. తనను ఉరితీయడానికి ముందే ఆమెను వివాహ బంధం నుంచి విడిపించాలని నిర్ణయించుకున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నాడు.


**పలు కేసుల్లో శిక్ష**

ఉగ్రవాదానికి నిధులు సమకూర్చిన కేసులో యాసిన్ మాలిక్ తీహార్ జైలులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నాడు. ఆయనపై పలు పాత కేసులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. 1990లో కాశ్మీరీ పండిట్ నర్సు సరళా భట్ హత్య, అదే ఏడాది వైమానిక దళ సిబ్బంది హత్య కేసులు వాటిలో ఉన్నాయి. సరళా భట్ హత్యలో తనకు సంబంధం లేదని, తనను తప్పుగా ఇరికిస్తున్నారని మాలిక్ గతంలో ఖండించాడు.



**2005లో పరిచయం.. 2009లో వివాహం**

యాసిన్ మాలిక్, ముషాల్ మాలిక్ 2005లో పాకిస్థాన్‌లో తొలిసారి కలుసుకున్నారు. కాశ్మీర్ సమస్యపై పాకిస్థాన్ వెళ్లిన సమయంలో ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాలిక్ ఫైజ్ కవిత్వాన్ని చదివాడు. ఆ కార్యక్రమానికి తన తల్లితో కలిసి హాజరైన ముషాల్.. అనంతరం మాలిక్ వద్ద ఆటోగ్రాఫ్ తీసుకుంది. ఆ పరిచయం క్రమంగా పెరిగి 2009లో వివాహానికి దారితీసింది. ఇద్దరి మధ్య దాదాపు 20 ఏళ్ల వయసు వ్యత్యాసం ఉంది.



## యోగా లేదా జిమ్..
# ఏది బెస్ట్ ఆప్షన్?



శరీరాన్ని ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకుంటే యోగా లేదా వ్యాయామం చేయాల్సిందే.. ప్రస్తుతం ఎక్కువ మంది ఊబకాయం సమస్యతో సతమతమవుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో జిమ్‌లో చెమటలు కక్కుతున్నారు. కొంతమంది వ్యాయామ శిక్షణపై దృష్టి పెడతారు. శారీరక దృఢత్వం, ఆరోగ్యం కోసం వ్యాయామం అనే శారీరక ప్రక్రియను చేస్తారు. ఇలా చేయడం వలన శారీరకంగానే కాదు మనసికమగా కూడా అనేక ప్రయోజనాలను పొందుతారు.మరోవైపు ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలను దూరం చేసుకోవాలనుకునే వారు యోగా, ప్రాణాయామం చేస్తుంటారు. యోగాతో మీరు ఏకాగ్రత నేర్చుకుంటారు. యోగా .. జిమ్ వర్కౌట్‌లలో ఏది బెటర్ అనే ప్రశ్న కొంతమందికి ఎప్పుడూ మనసులో ఉంటుంది. ఈ విషయంపై కల్ట్ ట్రాన్స్‌ఫార్మ్ యోగా ఎక్స్‌పర్ట్ దివ్య రోల్లా అనేక విషయాలను చెప్పారు. ఆరోగ్యంగా ఉండాలంటే శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవడం చాలా అవసరమని చెబుతున్నారు. దీంతో ఊబకాయం, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయి. అంతేకాదు మన శరీరంలోని కండరాలు కూడా ఫ్లెక్సిబుల్‌గా ఉంటాయి. యోగా, జిమ్ వ్యాయామాల మధ్య వ్యత్యాసం ఉంది. ఈ రెండింటి మధ్య తేడా గురించి ముందుగా చెప్పుకుందాం.

**యోగా అంటే ఏమిటి?**

యోగా అనేది భౌతిక భంగిమలు, ధ్యానం, లోతైన శ్వాసలతో కూడిన ఒక పురాతన అభ్యాసం. యోగా అనేది శరీరం, మనస్సు, ఆత్మ ఐక్యంగా ఉండే ఆధ్యాత్మిక ప్రక్రియ. ఈ పదం హిందూమతం, జైనమతం, బౌద్ధమతంలో ధ్యాన ప్రక్రియకు సంబంధించినది. యోగా అనేది సంస్కృత పదం యుజ్ నుండి వచ్చింది. అంటే సేకరించడం లేదా బంధించడం. యోగా ఒక ఆధ్యాత్మిక క్రమశిక్షణ. యోగాలో సూర్య నమస్కారంతో సహా అనేక ఆసనాలు, ప్రాణాయామం ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు గణనీయంగా యోగా పట్ల ఆసక్తిని చూపిస్తున్నారు.

**జిమ్ వ్యాయామం**

జిమ్ గురించి అందరికీ తెలుసు. వ్యాయామశాలలో వివిధ యంత్రాలతో పాటు గాడ్జెట్లను ఉపయోగించి వ్యాయామం చేస్తారు. ఫిట్ , టోన్డ్ బాడీని పొందడానికి చాలా మంది జిమ్‌కి వెళ్తుంటారు. ప్రజలు జిమ్‌కి వెళ్లి కార్డియో, కాళ్లు , వెయిట్ లిఫ్టింగ్ వంటి వివిధ వ్యాయామాలు చేస్తారు.

**రెండింటిలో ఏది మంచిది?**

రెండు ఆరోగ్యానికి మేలు చేసేవే అని యోగా ఎక్స్‌పర్ట్ దివ్య రోలా చెబుతున్నారు. యోగాలో శ్వాస నియంత్రణ అంటే ప్రాణయ, ఆసనం .. యోగా నిద్ర వంటి అంశాలు ఉంటాయి. ఇది శరీరం, మనస్సు రెండింటినీ రిలాక్స్ చేస్తుంది. అదే సమయంలో జిమ్ వ్యాయామంలో శక్తి శిక్షణ ఉంటుంది. ఇది జీవక్రియ. కండరాలకు మంచిది. నిపుణుల అభిప్రాయం ప్రకారం మీ శరీర తత్వాన్ని తెలుసుకోండి. మరింత సౌకర్యవంతంగా ఉన్న వాటిని ఆచరించండి.





# వెజిటేరియన్స్ ఎక్కువగా ఉన్న దేశాలెంటో తెలుసా

కొంతమంది చిన్నప్పటి నుంచీ మాంసాహారులు అయినప్పటికీ.. కారణాలు ఏమైనా కాలక్రమంలో శాకాహారులుగా మారిపోతున్నారు. ఇంకొంత మంది పుట్టినప్పటి నుంచీ శాకాహారులుగా ఉన్నా తదనంతర కాలంలో మాంసాహారులవుతున్నారని అంటుంటారు. ఏది ఏమైనప్పటికీ.. ఎవరు ఎలా మారినప్పటికీ.. శాకాహారం తినడమా, మాంసాహారం తినడమా అనేది పూర్తిగా వ్యక్తిగత ఎంపికనే చెప్పాలి. అయితే ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా చలా మంది ఇప్పుడు శాకాహారాన్ని అవలంభిస్తున్నారని అంటుంటారు. లైఫ్ స్టైల్ ఛేంజ్ లో భాగంగా ఆహారపు అలవాట్లనూ మారుస్తున్నారు. కొంతమంది హెల్త్ కాన్సియష్ కాస్త ఎక్కువగా ఉండి కూడా ఇలాంటి నిర్ణయాలు చేస్తున్నారని చెబుతుంటారు. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా శాకాహారుల సంఖ్య పెరుగుతుందని అంటుంటారు.

**శాకాహారులు ఎక్కువగా ఉన్న టాప్ - 5 దేశాలు...**

**భారతదేశం:**

అత్యధిక సంఖ్యలో శాకాహారం తినేవారు ఎక్కువగా ఉన్న దేశాల్లో అగ్రస్థానంలో ఉంది భారత్. ఇక్కడ ఉన్న జనాభాలో సుమారు 30శాతం మందికి పైగా ప్రజలు శాకాహారమే తింటారని చెబుతున్నారు. ఈ శాతంలో ప్రధాన వాటా హర్యానా, రాజస్థాన్ లలో నివసిస్తున్న ప్రజలని అంటుంటారు!

**ఇజ్రాయెల్:**

ఇజ్రాయెల్ జనాభాలో సుమారు 13 శాతం మం ప్రజలు శాకాహారులే. మనిషి తన ఆకలిని తీర్చుకోవడానికి జంతువులను చంపడాన్ని సమర్ధించలేమని ఇక్కడ నివసించే కొంతమం ప్రజానికం బలంగా నమ్ముతారంట.

**తైవాన్:**

శాఖాహర ఆహారాన్ని భుజించే జనాభా ఎక్కువ ఉన్న దేశాల్లో తైవాన్ మూడో స్థానంలో ఉంది. ఇక్కడున్న మొత్తం జనాభాలో 12 శాతం మంది ఇక్కడ శాకాహారాన్నే అనుసరిస్తున్నారు. ఇక్కడ వెజ్ రెస్టారెంట్స్ చాలానే ఉన్నాయి.

**ఇటలీ:**

ఇటలీ జనాభాలో సుమారు 10 శాతం మంది ప్రజలు వెజిటేరియన్స్. వాస్తవానికి ఇటలీ నాన్ వంటకాలకు ఎక్కువ ప్రసిద్ధి చెందినప్పటికీ.. ఇక్కడ శాకాహారుల సంఖ్య కూడా వేగంగా పెరుగుతోందని తాజా నివేదికలు చెబుతున్నా

**ఆస్ట్రియా:**

ప్రపంచ వ్యాప్తంగా శాకాహార ఆహారాన్ని అనుసరించే వ్యక్తుల విషయంలో ఆస్ట్రియా ఐదో స్థానంలో ఉంది. ఇక్కడ సుమారు 9 శాతం మం



# పరగడుపున పనీర్ తింటే.. బోలెడు లాభాలు



చీజ్ అని కూడా పిలువబడే పనీర్, వివిధ రకాల వంటకాలలో ఉపయోగించగల బహుముఖ ప్రయోజనాలు, రుచికరమైన పదార్థం. కానీ., ఉదయాన్నే పనీర్ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని మీకు తెలుసా..? మీ అల్పాహార దినచర్యలో పనీర్ చేర్చడం మీ మొత్తం శ్రేయస్సుకు ప్రయోజనకరంగా ఉండటానికి వివిధ కారణాలను ఒకసారి చూద్దాం.

**ప్రోటీన్ పుష్కలంగా:**

పనీర్ అధిక నాణ్యత ప్రోటీన్ యొక్క గొప్ప మూలం. ఇది మీ రోజును ప్రారంభించడానికి అనువైన ఆహారంగా మారుతుంది. కణజాలాలను నిర్మించడానికి, మరమ్మతు చేయడానికి, అలాగే ఆరోగ్యకరమైన ఎముకలు, కండరాలు, చర్మాన్ని నిర్వహించడానికి ప్రోటీన్ అవసరం.

**జీవక్రియను పెంచుతుంది:**

ఉదయాన్నే పనీర్ తినడం ద్వారా, మీరు మీ జీవక్రియను పెంచుకోవచ్చు. వేగవంతమైన జీవక్రియ బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇంకా రోజంతా మీకు మరింత శక్తిని అందిస్తుంది.

**మీకు కడుపు నిండుగా అనిపించేలా చేస్తుంది:**

పనీర్ అనేది మిమ్మల్ని ఎక్కువ కాలం సంతృప్తిగా, కడుపు నిండుగా ఉండేలా చేయడానికి సహాయపడే ఒక నింపే ఆహారం. ఇది రోజు చివరిలో అనారోగ్యకరమైన ఆహారాలను అతిగా తినడం, అల్పాహారం తీసుకోవడం నివారించవచ్చు.

**అవసరమైన పోషకాలను అందిస్తుంది:**

పనీర్ కాల్షియం, భాస్వరం, విటమిన్ ఎ, బి 12 వంటి విటమిన్లకు మంచి మూలం. బలమైన ఎముకలు, దంతాలు, మొత్తం రోగనిరోధక శక్తిని నిర్వహించడానికి ఈ పోషకాలు ముఖ్యమైనవి.

**రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది:**

ఉదయం పనీర్ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది డయాబెటిస్ లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారికి ముఖ్యమైనది. పనీర్ లోని ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు రక్తప్రవాహంలోకి చక్కెర శోషణను నెమ్మదిస్తాయి.



# గణనాథుడి పూజా పత్రాలు.. ఆరోగ్య ఔషధాలు



మన దేశంలో ప్రతి చోటా జరుపుకొనే అతిపెద్ద పండుగల్లో వినాయక చవితి ఒకటి. భాద్ర పదమాసం శుక్ల చతుర్థి శుభ సమయంలో హస్త నక్షత్రం రోజున చవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ పండుగ మిగతా పండుగల కంటే చాలా ప్రత్యేకమైనది. విఘ్నాలు తొలగించే వినాయకుడు ఎప్పుడూ ప్రథమ పూజలు అందుకుంటాడు. అలాంటి వినాయకుడిని ప్రతిష్టించి ప్రత్యేకంగా పూజ చేయడం అంటే ఎంతో పెద్ద సంబరం. వినాయకచవితిలో భాగంగా వినాయకుడిని విభిన్నంగా అందరూ కొన్ని ప్రత్యేకమైన ఆకులతో పూజ చేస్తారు. ఈ పత్రాలకు చాలా ప్రాముఖ్యత ఉంది. కొందరు దొరికినవి ఏవో తెచ్చి సంప్రదాయం కోసం పూజను ఏదోలా కానిచ్చేస్తుంటారు. అయితే వినాయకచవితి పూజకు ఉపయోగించే పత్రి 21 రకాల మొక్కల నుంచి సేకరించబడుతుంది. ఆ మొక్కలు ఏవి?? వాటి పేర్లు, వాటిని గుర్తుపట్టడం ఎలా అనే విషయాలు ఈ పర్వదినాన మీ అందరి కోసం...

## వినాయకుడిని పత్రి పెట్టి పూజిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం ఆయనకు సమర్పించే 21 రకాల ఆకులు.. వాటి ఉపయోగాలేంటో తెలుసుకోండి...

1) మాచీ పత్రం – మాచ పత్రి అనేది తెలుగు పేరు. దీని ఆకులు చామంతి పువ్వు ఆకుల్లా ఉంటాయి. కానీ సువాసన వస్తాయి. ఇది కుష్ఠు సంబంధ వ్యాధులను, బొల్లి వంటి చర్మవ్యాధులను, నరాల సంబంధ వ్యాధులను తగ్గిస్తుంది. ఊబకాయాన్ని కూడా తగ్గిస్తుంది. ఈ పత్రాలున్న పరిసరాల్లో ఎటువంటి సూక్ష్మక్రిములు దరిచేరవు. వీటిని వినాయకచవితి పూజలో తప్పనిసరిగా భాగం చేస్తారు.

2) దూర్వా పత్రం – దుర్వా పత్రం అనగానే చాలామంది గుర్తుపట్టలేరు కానీ గరిక అనగానే గుర్తు పడతారు. ఇందులో రెండు రకాలు ఉంటాయి. ఒకటి తెల్ల గరిక, మరొకటి నల్ల గరిక. ఇవి గడ్డిజాతికి చెందిన మొక్కలు. వినాయకుడికి గరిక అంటే ఎంతో ఇష్టం. ఇది దేహంలో రక్తాన్ని శుద్ధి చేస్తుంది. సకల చర్మరోగాలను, సోరియాసిస్ లాంటి వ్యాధులను తగ్గిస్తుంది.

3) ఆపామార్గ పత్రం – దీన్ని కూడా ఇలా పిలవగానే గుర్తుపట్టలేరు. కానీ ఉత్తరేణి అని అంటే ఆయుర్వేదం పరిచయం ఉన్నవారు గుర్తుపడతారు. దీనిఆకులు గుండ్రంగా ఉంటాయి. గింజలు ముళ్లను కలిగి ఉంటాయి. ఆయుర్వేదంలో ఉత్తరేణికి చాలా ప్రాధాన్యత ఉంది. ఇది దగ్గు ,ఉబ్బసం తగ్గేందుకు బాగా పని చేస్తుంది.

4) బృహతీ పత్రం : ఈ పత్రాన్ని ములక అని పిలుస్తారు. ఇందులో రెండు రకాలుంటాయి. ఒకటి చిన్న ములక, రెండోది పెద్ద ములక. ఈ ఆకులు వంకాయ ఆకుల తరహాలో తెల్లని చారలతో గుండ్రని పండ్లతో కనిపిస్తాయి. ఇది ఆయాసం, దగ్గు, మలబద్దకం, అతివిరేచనాలను తగ్గిస్తుంది. బాలింతలకు ఈచెట్టు ఒక వరం. ఇది అనేక దివ్యౌషధాల తయారీకి ఉపయోగపడుతుంది.

5) దుత్తూర పత్రం – ఉమ్మెత్త ఆకునే దుత్తూర పత్రం అంటారు. ఇది వంకాయ జాతికి చెందిన మొక్క. ఇది ఊపిరితిత్తులను వ్యాకోచింప చేసి ఉబ్బసం తగ్గేలా చేస్తుంది.

6) తులసి – దీని గురించి తెలియనిది ఎవరికి. సాక్షాత్తు విష్ణుమూర్తి భార్యనే తులసిగా భావిస్తారు, మహాలక్ష్మి తులసిలో కొలువై ఉంటుందని నమ్మకం కూడా. మహిళలు నిత్యం తులసి మొక్కకు పూజలు చేస్తారు. ఇవే మొక్క ఆకులను వినాయకుడి పూజలోనూ వాడుతారు. శరీరంలో ఉష్ణాన్ని నియంత్రిస్తుంది. అందుకే ప్రతి ఇంట్లో తులసి చెట్టు ఉండాలి. ఆ గాలికి జలుబు, దగ్గు వంటివి దరి చేరవు.

7) బిల్వ పత్రం – శివ నామ స్మరణ చేసే ప్రతి ఒక్కరికీ బిల్వపత్రం గురించి తెలిసి ఉంటుంది. మారేడు ఆకునే బిల్వ పత్రం అంటారు. ఇవి మూడు ఆకులు ఒక ఆకుగానే ఉంటాయి. శివుడికి బిల్వ పత్రాలు చాలా ఇష్టం. వినాయకుడి తండ్రి అయిన పరమేశ్వరుడి ఇష్టమైన ఈ ఆకులను వినాయకుడి పూజలో వాడుతారు. ఇది నీటిని శుద్ధి చేస్తుంది. కీళ్ల సంబంధ వ్యాధులను, విరేచనాలను తగ్గిస్తుంది. రోగనిరోధకశక్తిని పెంచుతుంది. జీర్ణక్రియను వృద్ధి చేస్తుంది.

8) బదరీ పత్రం – అందరికీ వెంటనే గుర్తురాకపోవచ్చు కానీ రేగు చెట్టు అనగానే అందరికీ గుర్తొస్తుంది. ఇది చర్మ వ్యాధులకు మంచి విరుగుడు.

9) చూత పత్రం – మామిడి చెట్టు ఆకును చూత పత్రం అంటారు. ఈ మామిడాకులు ప్రతి శుభకార్యంలో ఇండ్లకు తోరణాలు కట్టడం కోసం ఉపయోగిస్తారు. వినాయకచవితి పూజలోనూ భాగం చేస్తారు. నోటి దుర్వాసన,చిగుళ్ల వాపు వంటి సమస్యల నుంచి ఉపసమనం ఇస్తుంది.

10) కరవీర పత్రం – ప్రతి ఇంటి పెరటిలో పెంచుకునే గన్నేరు చెట్టు గురించి అందరికీ తెలిసినదే. గన్నేరు ఆకులనే కరవీర పత్రాలు అంటారు. ఇవి తెలుపు, ఎరుపు, పసుపు రంగు పూలను పూస్తాయి. గాయాలు త్వరగా మానడానికి ఇది ఉపయోగపడుతుంది.

11) మరువక పత్రం – దీన్ని ధవనం, మరువం అని పిలుస్తారు. పూలను దండగే కట్టేటప్పుడు మధ్యలో ఈ ఆకులను చేర్చి కడితే మరింత అందంగా, మరెంతో సువాసనను వెదజల్లుతాయి. మరువక పత్రాలు ఎంతో మంచి సువాసనను కలిగి ఉంటాయి. ఇది మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది.

12) శమీ పత్రం – ప్రతి గుడిలో జమ్మివృక్షం ఉంటుంది. జమ్మి చెట్టు ఆకును శమీ పత్రం అంటారు. దసరా సమయంలో ఈ చెట్టుకు ప్రత్యేకపూజలు చేస్తారు. ఈ మొక్క ఆకులను వినాయకుడి పత్రిలోనూ ఉంచుతారు. ఇది నోటి వ్యాధులను తగ్గిస్తుంది.

13) విష్ణుక్రాంత పత్రం – ఈ మొక్కకు నీలం, తెలుపు రంగు పూలు పూస్తాయి. దీన్ని ఆయుర్వేద ఔషధం తయారుచేయడానికి వాడతారు. వీటిని చర్మ రక్షణ కోసం వాడతారు

14) సింధువార పత్రం – దీన్ని వావిలి ఆకు అని కూడా పిలుస్తారు. వాత రోగాలను తగ్గించే అద్భుత ఔషధం ఇది. కీల్లనొప్పులకు మంచి మందు.

15) అశ్వత్థ పత్రం – రావి ఆకులను అశ్వత్థ పత్రం అని అంటారు. సంసారాన్ని అశ్వత్థ వృక్షంతో పిలుస్తారు భగవద్గీతలో కృష్ణుడు. రావి చెట్టుకు పూజలు చేసినట్లుగానే దాని ఆకులను గణేషుడి పూజ కోసం ఉపయోగిస్తారు. దీన్ని ఔషధాల తయారీలో వాడతారు.

16) దాడిమీ పత్రం – ఎన్నో ఆరోగ్యాలు చేకూర్చే దానిమ్మ అందరికీ తెలుసు. దానిమ్మ చెట్టు ఆకును దాడిమీ పత్రం అంటారు. ఇది వాంతులు, విరేచనాలను అరికడతాయి. శరీరంలో ఉన్న హానికారక క్రిములను నాశనం చేస్తుంది.

17) జాజి పత్రం – మల్లె పువ్వు జాతికి చెందిన మొక్క సన్నజాజి. ఈ జాజి మొక్క ఆకులను వినాయకుడి పూజకు వాడుతారు. ఇది చర్మ రోగాలను నివారించేందుకు ఉపయోగపడుతుంది.

18) అర్జున పత్రం – మద్ది చెట్టు ఆకులను అర్జున పత్రం అని పిలుస్తారు. ఇవి మర్రి ఆకుల మాదిరిగా ఉంటాయి. ఈ వృక్షాలు ఎక్కువగా అడవుల్లో పెరుగుతాయి. రక్త స్తంభనం, గుండె ఆరోగ్యానికి ఇది చాల సహాయకరంగా ఉంటుంది.

19) దేవదారు పత్రం – దేవదారు చెట్ల గురించి ప్రాచీన కవులు ఎంతో గొప్ప వర్ణనలు చేస్తూ ఎన్నో గొప్ప కావ్యాలు రచించారు. దేవదారు చెట్లు ఎత్తుగా పెరుగుతాయి. ఈ చెట్టు దేవతలకు ఎంతో ఇష్టం. ఇది శరీర వేడిని తగ్గిస్తుంది. ఆ చెట్టు ఆకులను వినాయకుడి పత్రిలో ఉపయోగిస్తారు. ఇది శరీర వేడిని తగ్గిస్తుంది.

20) గండకీ పత్రం – ఈ మొక్క తీగ జాతికి చెందినది. గడ్డిలా ఉంటుంది. దీన్ని లతాదూర్వా మొక్క అని కూడా అంటారు. ఈ ఆకులను వినాయకుడి పూజలో వాడుతారు. ఇది అతిమూత్ర సమస్య నుంచి ఉపశమనం ఇస్తుంది.

21) అర్క పత్రం – జిల్లేడు మొక్క ఆకులను అర్క పత్రాలు అంటారు. వినాయకుడు జిల్లేడు చెట్టులో కొలువై ఉంటాడని చెబుతారు. అటువంటి తెల్లజిల్లేడు మొక్క ఆకులను వినాయకుడి పత్రిలో ఉంచుతారు. నరాల బలహీనత ఉన్న వారికిది దివ్య ఔషధం. చర్మ వ్యాధులను కూడా నివారిస్తుంది.

భాద్ర పద మాసంలో వానలు పడుతూ, ఎక్కడికక్కడ చిత్తడిగా, బురదగా ఉంటుంది. జ్వరాలు వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వినాయక పూజలో ఈ పత్రాల వల్ల ఎన్నో ఔషధ మొక్కలు ఇంట్లోకి వచ్చినట్టు అవుతుంది. వినాయక విగ్రహాన్ని తొమ్మిది రోజులు ఉంచకపోయినా పూజ చేసిన పత్రిని మాత్రం తొమ్మిదిరోజులు ఉంచుకోవాలి. దాని వల్ల మనం పీల్చే గాలి ఔషధ గుణాలు నిండి ఆరోగ్యాన్ని చేకూర్చుతుంది.



# హెల్తీ స్వీట్ బెల్లం బర్ఫీ



ప్రొటీన్లతో నిండిన ఆహారం తినడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. స్వీట్లలో కూడా ప్రొటీన్లు యాడ్ చేసుకోవచ్చని మీకు తెలుసా.. అవును అదే ఈ స్పెషల్ హెల్తీ బెల్లం బర్ఫీ. ఇది పుట్నాల పప్పుతో చేసే స్వీట్. దీనిలో బెల్లం, పుట్నాలు పప్పు వాడతాం కాబట్టి... ప్రొటీన్, ఐరన్ అధికంగా లభిస్తుంది. పిల్లలకు సాయంత్రం పూట ఈ స్వీట్‌ని తినిపించడం వల్ల వారికి ఐరన్ లోపం లేదా ప్రొటీన్ లోపం రాకుండా ఉంటుంది. దీన్ని చేయడం కూడా చాలా సులువు. ఇది ఎలా చేయాలో చూసేయండి...

**కావాల్సిన పథార్థాలు..**

పుట్నాల పప్పు ఒక కప్పు
బెల్లం తురుము ఒక కప్పు
నీళ్లు సరిపడినన్ని
కొబ్బరి తురుము పావు కప్పు
నెయ్యి ఒక స్పూన్
యాలకుల పొడి అర స్పూను

తయారీ విధానం..

1. స్టవ్ మీద కడాయి పెట్టి నెయ్యి వేయండి.
2. అందులో పుట్నాల పప్పును, కొబ్బరి తురుమును వేసి వేయించండి. చిన్న మంటపై ఇలా వేయించాలి. తర్వాత స్టవ్ ఆఫ్ చేయాలి.
3. ఇప్పుడు ఈ మొత్తం మిశ్రమాన్ని మిక్సీ జార్లో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. అందులోనే యాలకుల పొడిని కూడా కలుపుకోవాలి.
4. ఇప్పుడు అదే కడాయిలో బెల్లం తురుము, నీళ్లు వేసి వేడి చేయాలి.
5. బెల్లం కరిగాక ముందుగా మిక్సీ పట్టుకున్న పుట్నాల పప్పు పొడిని వేసి బాగా కలుపుకోవాలి.
6. ఇది హల్వాలాగా దగ్గరగా అయ్యే వరకు ఉంచుకోవాలి.
7. కావాలంటే నెయ్యిని మరి కొంచెం వేసుకోవచ్చు.
8. ఇప్పుడు ఒక ప్లేట్ కి నెయ్యి రాసి దానిపై ఈ మొత్తం మిశ్రమాన్ని వేయాలి.
9. చల్లారే వరకు ఉంచి తర్వాత బర్ఫీల్లా ముక్కలుగా కోసుకోవాలి.
10. అంతే టేస్టీ పుట్నాల పప్పు స్వీట్ రెడీ.

ఈ బెల్లం బర్ఫీని చేయడం చాలా సులువు. అలాగే ఎంతో రుచిగా కూడా ఉంటుంది. ఇందులో ఎన్నో పోషకాలు కూడా ఉంటాయి. బెల్లం తినడం వల్ల ఐరన్ లోపం రాకుండా ఉంటుంది. ప్రతిరోజు పిల్లలకు ఒక పుట్నాల పప్పు స్వీటు అందిస్తే చాలు, శరీరానికి కావాల్సిన ఐరన్ అందుతుంది. పుట్నాల పప్పులో ప్రొటీన్ అధికంగా ఉంటుంది. పిల్లలకు స్కూల్ నుంచి వచ్చాక సాయంత్రం పూట జంక్ ఫుడ్, చాక్లెట్లు అలవాటు చేసే బదులు ఇలాంటి హెల్తీ స్వీట్‌ను అందించడం ఎంతో మంచిది.



PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S